




# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com








హైదరాబాద్ | శనివారం 31-10-2020 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-2020 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :27 | సంచిక:76 | పేజీలు: 4 | వెల: రూ.1/-


# ఎలక్ట్రిక్ వాహనాల హబ్‌గా తెలంగాణ

## నూతన ఎలక్ట్రిక్ వెహికిల్ పాలసీ ప్రకటన
## కాలుష్యాన్ని తగ్గించేందుకు ఎలక్ట్రిక్ వాహనాలకు ప్రోత్సాహం
## ఇవి పాలసీ ప్రకటనలో మంత్రి కెటిఆర్ వెల్లడి
## పలు కంపెనీలతో ప్రభుత్వం ఒప్పందాలు

హైదరాబాద్,అక్టోబర్30(ఆర్ఎన్ఎ): తెలంగాణను ఎలక్ట్రిక్ వాహనాల హబ్‌గా మార్చబోతున్నామని, ఎలక్ట్రిక్ వాహనాలు పర్యావరణ ఫ్రెండ్లీ వెహికల్స్ అని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ అన్నారు. ఇప్పటికే టీఎస్ ఐపాస్, బీఎస్ ఐపాస్ విజయవంతం అయ్యాయి. ఎలక్ట్రిక్ వాహనాలు కూడా విజయవంతం కాబోతున్నాయి. గత ఐదేళ్లలో తెలంగాణకు 2.8 బిలియన్ డాలర్ల పెట్టుబడులు వచ్చాయని మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన నూతన ఎలక్ట్రిక్ వెహికిల్ (ఈవీ) పాలసీని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్, రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్ కలిసి శుక్రవారం ఉదయం విడుదల చేశారు. జూబ్లీహిల్స్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రంలో తెలంగాణ ఈవీ సమ్మిట్‌లో పాలసీ విధానాన్ని ప్రకటించారు. 2020–2030 వరకు ఎలక్ట్రిక్ వాహనాల తయారీ, వినియోగంపై విధానమైన ప్రకటన చేశారు. ఐదు కంపెనీలతో ఇవాళ ఒప్పందాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎలక్ట్రిక్ వాహనాల పాలసీని మంత్రి కేటీఆర్ విడుదల చేశారు. కాలుష్యాన్ని తగ్గించేందుకు ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహించేలా పాలసీ రూపొందించారు. తయారీ, పెట్టుబడిదారులకు రాయితీలు కల్పించేలా నూతన విధానం రూపొందించినట్లు కేటీఆర్ తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో హైదరాబాద్ ప్రజలతో పాటు రైతులు ఇబ్బందులు పడ్డారు. పర్యావరణాన్ని రక్షించాల్సిన అవసరం మనందరిపై ఉందన్నారు. కాలుష్యాన్ని అరికట్టాల్సిన బాధ్యతను కరోనా మరోసారి గుర్తు చేసిందన్నారు. కాలుష్యం లేని వాతావరణాన్ని భవిష్యత్ తరాలకు మనం ఇవ్వాల్సిన అవసరం ఏర్పడిందని తెలిపారు. డీ కార్బనైజేషన్, డిజిటలైజేషన్, డీ సెంట్రలైజేషన్ అమలు చేయాలని సూచించారు. మరి కొన్నేళ్లలోనే రాష్ట్రంలోని జనాభా గ్రామాల కంటే పట్టణాల్లోనే ఎక్కువగా ఉంటుందన్నారు. రాష్ట్ర జీఎస్‌డీపీలో 50 శాతం హైదరాబాద్ నుంచే వస్తుందని పేర్కొన్నారు.

మన వద్ద పెద్ద ఎత్తున సౌర విద్యుత్ అందుబాటులో ఉందన్నారు. సోలార్ విద్యుత్ ఉత్పత్తిలో దేశంలోనే రెండో స్థానంలో ఉన్నామని స్పష్టం చేశారు. ఛార్జింగ్ స్టేషన్లు, బ్యాటరీ తయారీ కంపెనీలు పెట్టుబడి పెట్టనున్నాయి.

ఎలక్ట్రిక్ మ్యానుఫ్యాక్చరింగ్ కోసం అందుబాటులో భూములు ఉన్నాయని తెలిపారు. మహేశ్వరంలో వేల ఎకరాలు అందుబాటులో ఉన్నాయి. వెయ్యి ఎకరాల్లో ఆటో మొబైల్ తయారీ యూనిట్‌ను ప్రోత్సహిస్తామని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో ఎన్విరాన్‌మెంట్ ఫ్రెండ్లీ వాహనాల తయారీ, నిర్వహణకు కంపెనీలను ఆహ్వానిస్తున్నామని తెలిపారు. గతంలో ఈసీఐఎల్ వంటి ప్రభుత్వరంగ సంస్థలతో ఎలక్ట్రానిక్స్ రంగంలో దేశానికే హైదరాబాద్ కేంద్రంగా ఉండేది. ఎలక్ట్రిక్ వాహనాల నూతన విధానం అద్భుతంగా విజయవంతం కాబోతుందన్నారు. హైదరాబాద్‌లో పెద్ద ఎత్తున ఎలక్ట్రిక్ వాహనాల తయారీ యూనిట్లు నెలకొల్పుతామని చెప్పారు. ఎలక్ట్రిక్ వాహనాల తయారీ రంగంలో కంపెనీలు పెట్టుబడులు పెట్టబోతున్నాయని తెలిపారు. ఇప్పటికే 78 ఛార్జింగ్ స్టేషన్లు ఆర్టీసీ ఆధ్వర్యంలో ఉన్నాయన్నారు.

ఐటీ ఉత్పత్తుల ఎగుమతుల్లో తెలంగాణ రెండో స్థానంలో ఉందన్నారు. ఐటీ రంగంలో జాతీయ స్థాయి కంటే ఎక్కువ అభివృద్ధి రేటు ఉందని కేటీఆర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పువ్వాడ అజయ్ కుమార్, ఇంద్రకరణ్ రెడ్డి, రవాణా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సునీల్ శర్మ, పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేశ్ రంజన్, సినీ నటుడు విజయ్ దేవరకొండ, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నీతిఆయోగ్ సీఈవో అమితాబ్ కాంత్, మహీంద్రా అండ్ మహీంద్రా ఛైర్మన్ ఆనంద్ మహీంద్రా పాల్గొన్నారు.



హైదరాబాద్ ఎంసిఆర్ హెచ్‌ఆర్‌డిలో జరిగిన కార్యక్రమంలో ఎలక్ట్రిక్ వాహనాల పాలసీని విడుదల చేసిన మంత్రి కెటిఆర్. చిత్రంలో ఐటి సెక్రటరీ జయేశ్ రంజన్, మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ తదితరులు ఉన్నారు.

### అన్ని రంగాల్లో తెలంగాణ ముందుకు: దేవరకొండ

తెలంగాణ ప్రభుత్వంపై సినీ నటుడు విజయ్ దేవరకొండ ప్రశంసల వర్షం కురిపించారు. రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకుపోతుందని కొనియాడారు. ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్ అద్భుతమైన పాలసీలతోరాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకుపోతున్నారని పేర్కొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం రూపొంది ంచిన నూతన ఎలక్ట్రిక్ వెహికిల్ (ఈవీ) పాలసీ విడుదల కార్యక్రమంలో విజయ్ దేవరకొండ పాల్గొని ప్రసంగించారు. గతంలో సమస్యలు వస్తే పరిష్కరించేందుకు చాలా సమయం పట్టేది.. ఇప్పుడు ఆ సమస్య లేదన్నారు. ముందు చూపుతో సమస్యలను వీలైనంత త్వరగా ప్రభుత్వం పరిష్కరిస్తుందన్నారు. తమ జిల్లాతో పాటు గ్రామానికి సాగు నీరు వచ్చిందన్నారు. 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్ ఇవ్వడం, సాగునీరు రావడం వల్ల రైతులు రెండు పంటలు వేసుకుంటున్నారు. భూముల ధరలు కూడా పెరిగాయని అన్నారు. పరిశ్రమలు భారీగా వస్తున్నాయని తెలిపారు. భవిష్యత్ ఈ వెహికల్స్‌దే అని అన్నారు. ఎలక్ట్రిక్ వెహికల్స్ వచ్చే జనవరి నాటికి అందుబాటులోకి వస్తాయని, తద్వారా హైదరాబాదీల లైఫ్ స్టైల్ మారబోతుందని విజయ్ దేవరకొండ స్పష్టం చేశారు.

# కరోనాతో మరో ఆరుగురు మృతి

హైదరాబాద్,అక్టోబర్30 (ఆర్ఎన్ఎ): తెలంగాణ రాష్ట్రంలో 43,790 కరోనా నిర్ధారణ పరీక్షలు నిర్వహించగా కొత్తగా 1,531 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. దీంతో మొత్తం ఇప్పటి వరకు నమోదైన కేసుల సంఖ్య 2,37,187కి చేరింది. ఈమేరకు వైద్య ఆరోగ్యశాఖ శుక్రవారం ఉదయం బులిటెన్ విడుదల చేసింది.

గురువారం ఒక్కరోజే కరోనాతో ఆరుగురు మృతి చెందారు. దీంతో మృతుల సంఖ్య 1,330కి చేరింది. కరోనా బారి నుంచి నిన్న ఒక్క రోజే 1,048 మంది కోలుకున్నారు. దీంతో ఇప్పటివరకు కోలుకున్న బాధితుల సంఖ్య 2,17,401కి చేరింది. రాష్ట్రంలో ప్రస్తుతం 18,456 యాక్టివ్ కేసులు ఉన్నాయని, వారిలో 15,425 మంది హోం ఐసోలేషన్‌లో చికిత్స పొందుతున్నారని వైద్య ఆరోగ్యశాఖ తెలిపింది. తెలంగాణ రాష్ట్రంలో ఇప్పటి వరకు నిర్వహించిన కరోనా నిర్ధారణ పరీక్షల సంఖ్య 42,40,748కి చేరింది.

# 'అబద్దాలకు ఆస్కార్ అవార్డుంటే అది బీజేపీకే'

సిద్దిపేట, అక్టోబర్ 30: భారతీయ జనతా పార్టీ నాయకులపై రాష్ట్ర ఆర్థిక మంత్రి హరీష్ రావు విరుచుకుపడ్డారు. అబద్దాలకు ఆస్కార్ అవార్డు ఉంటే అది బీజేపీకే దక్కుతుందని విమర్శించారు. సిద్దిపేటలో ఇవాళ ఆయన మీడియాతో మాట్లాడుతూ.. బీజేపీ ఎంపీలు గెలిచిన చోట అభివృద్ధి శూన్యమని తెలిపారు. బాండ్ పేపర్ మీద వాగ్దానాన్నిరాసిచ్చిన ఎంపీ.. ఇప్పటికీ పసుపు బోర్డు తేలేదు. పసుపు రైతుల బాధ తీర్చలేదని గుర్తు చేశారు. కరీంనగర్, ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాల్లో ఏమి అభివృద్ధి జరిగిందని ప్రశ్నించారు. బీజేపీ నాయకుల అసలు స్వరూపం జనాలకు తెలిసి పోయిందన్నారు. అందుకే వారి నియోజకవర్గాల్లోని కార్పొరేషన్లను, మున్సిపాలిటీలను టీఆర్ఎస్ పార్టీ గెలుచుకున్నదని తెలిపారు. అబద్దాలకు ఆస్కార్ అవార్డు ఉంటే అది కచ్చితంగా బీజేపీకే దక్కుతుందన్నారు. ఈ విషయం ఘంటా పథంగా చెప్పగలను అని అన్నారు. అబద్దాలతో అధికారంలోకి రావాలనుకునే వారు అభివృద్ధి చేయకపోగా, మరిన్ని అబద్ధాలతో మోసం చేస్తారు.. దుబ్బాక ప్రజలారా మోసపోతే.. గోస పడుతాం.. తస్మాత్ జాగ్రత్త అని హరీష్ రావు చెప్పారు.

# సర్దార్ పటేల్ జూను ప్రారంభించిన ప్రధాని



అహ్మదాబాద్,అక్టోబర్30(ఆర్ఎన్ఎ): ప్రధాని నరేంద్రమోదీ రెండు రోజుల గుజరాత్ పర్యటనలో వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. తాజాగా నర్మదా జిల్లాలోని కెవాడియాలో సర్దార్ పటేల్ జూలాజికల్ పార్కును ప్రారంభించారు. జంగిల్ సఫారీగా పేరొందిన ఈ ప్రాంతాన్ని గుజరాత్ సర్కారు జూలాజికల్ పార్కుగా తీర్చిదిద్దింది. అనంతరం ఆ పార్కులోని టూరిస్టు వాహనంలో ప్రయాణిస్తూ జూలో జంతువులు అన్నింటిని వీక్షించారు. ఆ తర్వాత జూపార్కులోని పక్షి ప్రదర్శన కేంద్రాన్ని ప్రధాని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన కొద్ది సేపు రెండు రామ చిలుకలతో కాలక్షేపం చేశారు. కాగా ప్రధాని ఈ ఉదయం నుంచి కెవాడియాలో పలు కార్యక్రమాలకు హాజరయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం సిద్ధం చేసి ఉంచిన ఆరోగ్య వన్ పార్కును, ఏక్తా మాల్‌ను, చిల్డ్రన్ న్యూట్రిషన్ పార్కును ఆయన ప్రారంభించారు. శనివారం కూడా ప్రధాని గుజరాత్ పర్యటనలో భాగంగా పలు కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ జన్మదినం సందర్భంగా నిర్వ హించే ఏక్తా దివస్ పరేడ్ లో పాల్గొంటారు. నర్మదా నదీ తీరంలోని ఐక్యతా విగ్రహం దగ్గర పటేల్‌కు నివాళులు అర్పించనున్నారు. అన్ని అధికారిక భాష ల్లో రూపొందించిన ఐక్య త విగ్రహ నూతన వెబ్ సైట్ ను లాంఛ్ చేయనున్నారు మోదీ. కెవాడియా–అహ్మ దాబాద్ మధ్య సీప్లేన్ సేవలను జాతికి అంకితం చేస్తారు. నర్మదా జిల్లాలోని కెవాడియాలో 'ఆరోగ్య వన్' ఔషధ మొక్కల పార్కును ప్రారంభించారు. ప్రారంభోత్సవం తర్వాత ఆ ఉద్యానవనం మొత్తం తిరిగి పరిశీలించారు. మోడీ వెంట గుజరాత్ గవర్నర్ ఆచార్య దేవవ్రత్, సీఎం విజయ్ రూపాని ఉన్నారు. పార్కు విశేషాలను వారు ప్రధానికి వివరించారు. కరోనా వ్యాప్తి క్రమంలో మార్చిలో లాక్ డౌన్ విధించాక మోడీ గుజరాత్ రావడం ఇదే మొదటి సారి. మోడీ తన పర్యటన సందర్భంగా గుజరాత్ మాజీ సీఎం కేశూభాయ్ పటేల్ కు నివాళులు అర్పించారు.

# ఎమ్మెల్సీ కవితను అభినందించిన మంత్రి ఇంద్ర



హైదరాబాద్,అక్టోబర్30(ఆర్ఎన్ఎ): నిజామాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి అభినందించారు. శుక్రవారం బంజారాహిల్స్ లోని ఆమె నివాసంలో మొక్కను అందజేసి మంత్రి శుభాకాంక్షలు తెలిపారు. శాసన మండలిలో ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి కవితతో గురువారం ప్రమాణ స్వీకారం చేయించారు. ఈసందర్భంగా మంత్రి అల్లోల మాట్లాడుతూ టీఆర్ఎస్ ప్రభుత్వం అమలుచేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల వల్ల తెలంగాణ ఎంతో పురోగతి సాధించిందన్నారు. తెలంగాణలో అమలు జరుగుతున్నపథకాలు, అభివృద్ధి దేశానికి రోల్‌మోడల్‌గా ఉందన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌నేతృత్వంలో తెలంగాణ మరింత అభివృద్ధి సాధిస్తుందని చెప్పారు.

# 'వాట్స్ అండ్ వోల్ట్స్' కంపెనీలో భాగస్వామిగా హీరో విజయ్ దేవరకొండ




హైదరాబాద్,అక్టోబర్30టాలీవుడ్ స్టార్ హీరో విజయ్ దేవరకొండ మరో కొత్త వ్యాపారంలో భాగస్వామి అయ్యారు. హైదరాబాద్‌కు చెందిన వాట్స్ అండ్ వోల్ట్స్ మొబిలిటీ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో పెట్టుబడులు పెట్టారు. ఈ కంపెనీని విజయ్ మద్దూరి, కేదార్ సెలగంశెట్టి, వంశీ కారువంచి నిర్వహిస్తున్నారు. శుక్రవారం నగరంలో ఐటీ మంత్రి కేటీఆర్ ఆధ్వర్యంలో జరిగిన ఎలక్ట్రిక్ వెహికిల్ సమిట్‌లో ఈ కం పెనీ తన బిజినెస్ ప్లాన్‌ను లాంచ్ చేసింది. వాట్స్ అండ్ వోల్ట్స్ కంపెనీ అంది ంచే ఎలక్ట్రిక్ బైక్స, స్కూటర్లను నగరవాసులు అద్దె చెల్లించి ఉపయోగించుకోవచ్చు. ప్రయాణించే దూరానికి తగినంత మొత్తం చెల్లించాల్సి ఉంటుంది.పర్యావరణ హిత మైన ఈ ఎలక్ట్రానిక్ స్కూటర్లు, బైక్‌లతో కాలుష్యం తగ్గడంతో పాటు సమయం, డబ్బు ఆదా కానున్నాయి. భవిష్యత్‌లో ఎలక్ట్రిక్ వెహికిల్స్ కు మంచి డిమాండ్ ఏర్ప డుతుందని, ఈ వాహనాల వల్ల రానున్న తరాలకు ఆరోగ్యవంతమైన పర్యావరణం అందుతుందని విజయ్ దేవరకొండ భావిస్తున్నారు. అందుకే వాట్స్ అండ్ వోల్ట్స్ సంస్థలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చారు. వచ్చే ఏడాది జనవరి నుంచి ఈ సంస్థ కార్యకలాపాలు ప్రారంభం కానున్నాయి.

# ప్రతి గ్రామంలో శాశ్వత పంచాయతీ కార్యాలయాలు

మేడ్చల్ మల్కాజిగిరి, అక్టోబర్ 30 : టీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రతి గ్రామానికి శాశ్వత ప్రాతిపదికన పంచాయతీ కార్యాలయాలను నిర్మిస్తున్నామని కార్మికశాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. కీసర మండల పరిధి నర్సంపల్లి గ్రామంలో పంచాయతీ భవన నిర్మాణానికి మంత్రి భూమి పూజ చేశారు. అలాగే తిమ్మాయిపల్లి గ్రామంలో మండల్ ఫండ్ కింద కేటాయించిన నిధులతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్డుల పనులను కూడా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కీసర మండలంలో అన్ని గ్రామాల్లో శాశ్వత పంచాయతీ భవనాలను నిర్మించామన్నారు. పెండింగ్‌లో ఉన్న నర్సంపల్లిలో కూడా చేపట్టామని, పనులు చేసే సదరు కాంట్రాక్టర్‌లు ఈ పనులను నాణ్యతతో చేపట్టాలన్నారు. తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తరువాత అన్ని వర్గాలకు సముచిత న్యాయం చేసేందుకు ప్రభుత్వ భవనాలను నిర్మించి ఎలాంటి లోటుపాట్లు లేకచైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి, జడ్పీటీసీ బెస్త వెంకటేశ్, కీసర ఎంపీపీ మల్లారపు ఇందిర, నర్సంపల్లి సర్పంచ్ సత్తమ్మ, తిమ్మాయిపల్లి సర్పంచ్ పిడిచుట్టి పెంటయ్య టీఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు.

## చరిత్రలో నేటినిజం



కం॥ కేరళకు ముఖ్యమంత్రిగ
సారథ్యమ్మును వహించి - సత్పాలనపై
సారించుచు తన దృష్టిని
పోరాట గరిమించె ప్రజకు - "ఊమన్ చాందీ"!!

( అక్టోబర్ 31 ఊమన్ చాందీ జన్మదినం..)

-రాధశ్రీ

సెల్: 9494481210



# దేవరకద్ర నియోజకవర్గంలో 80 డబుల్ బెడ్‌రూం ఇండ్లు ప్రారంభం



మహబూబ్‌నగర్ , అక్టోబర్30: జిల్లాలోని భూత్పూర్ మండలం అన్నాసాగర్‌లో రూ. 428.20 కోట్లతో నిర్మించిన 80 డబుల్ బెడ్ రూం ఇండ్లను మంత్రులు వేముల ప్రశాంత్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్ కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి, ఎంపీ మన్నె శ్రీనివాస్ రెడ్డి, జడ్పీ ఛైర్‌పర్సన్ స్వర్ణ సుధాకర్ రెడ్డితో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. పేదల గురించి ఆలోచించే ఏకైక ప్రభుత్వం టీఆర్ఎస్ ప్రభుత్వం మాత్రమే అని స్పష్టం చేశారు. కులమతాలకు అతీతంగా ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు అందుతున్నాయని తెలిపారు. రైతులకు ఉచిత కరెంట్ ఇస్తున్నాం. కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకం ద్వారా పేదింటి ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక చేయూతను అందిస్తున్నామని చెప్పారు. ఒకప్పుడు ఇతర రాష్ట్రాల నుంచి బియ్యం దిగుమతి చేసుకునే వాళ్లం.. ఇప్పుడు 60 శాతం బియ్యాన్ని తెలంగాణ నుంచి ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నామని పేర్కొన్నారు. పాలమూరు ఎత్తిపోతల పథకానికి జాతీయ హోదా కోసం బీజేపీ నాయకులు కృషి చేయాలని శ్రీనివాస్ గౌడ్ సూచించారు.

అనంతరం మంత్రి ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ.. దేవరకద్ర నియోజకవర్గానికి మరో 1500 డబుల్ బెడ్ రూం ఇండ్లు మంజూరు చేస్తామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల పేరిట కాంగ్రెస్ నాయకులు పేదల నుంచి డబ్బులు దోచుకున్నారని ధ్వజమెత్తారు. కానీ టీఆర్ఎస్ ప్రభుత్వం పేదల నుంచి ఒక్క రూపాయి కూడా తీసుకోకుండా.. డబుల్ బెడ్ రూం ఇండ్లను కట్టించి ఇస్తుందన్నారు. రాష్ట్రంలోని ప్రతి నిరుపేదకు ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందాలన్నదే సీఎం కేసీఆర్ లక్ష్యమని మంత్రి ఉద్ఘాటించారు. పోలవరం ప్రాజెక్టుకు నిధులిస్తున్నా కేంద్రం.. పాలమూరు ఎత్తిపోతల పథకాన్ని ఎందుకు పట్టించుకోవడం లేదని కిషన్ రెడ్డి, బండి సంజయ్‌ను ప్రశ్నించారు. రాష్ట్రానికి నిధులు వచ్చేలా కేంద్రంపై ఒత్తిడి తేవాలని బీజేపీ నేతలకు మంత్రి వేముల సూచించారు.

నేటి నిజం
శనివారం 31-10-2020

# ధరణికి మరింత పదును పెట్టాలి

ధరణి రాష్ట్ర వ్యాప్తంగా అమల్లోకి వచ్చింది. తెలంగాణలో ఉన్న అన్ని భూముల వివరాలు ఇందులో పక్కాగా ఉండి, ఎలాంటి చిక్కులు లేకుంటే నిజానికి ఇది దేశానికి ఆదర్శంగా నిలుస్తుంది. అయితే ఇది తొలి అడుగుగానే భావించాలి. ప్రజలకు కూడా దీనిపై అవగాహన ఏర్ప డాలి. అంతేగాకుండా లోటుపాట్లను సవరించుకునేలా ప్రభుత్వం కూడా సిద్దంగా ఉండాలి. వివాదాస్పద భూములకు సంబంధించిన వివరాలు కూడా ఉంటే అమ్మకాలు, కొనుగోళ్లలో ప్రజలు జాగ్రత్త వహిస్తారు. అలాగే భూములకు సంబంధించిన సమగ్ర సర్వే తరువాతే వాస్తవ వివరాలు తెలుస్తాయని గుర్తుంచుకోవాలి. ఎప్పటికప్పుడు మార్పులు, చేర్పులకు అవకాశం ఉండేలా ధరణిని నిరంతరాయంగా మానిటరింగ్ చేసేలా ÷-రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాల్సి ఉ ంది.అయితే.. ధరణిలో ఉన్న సమాచారం ఆధారంగా రైతుబంధు ఇచ్చాం కాబట్టి అదే ప్రామాణికం అనడం వల్ల క్షేత్రస్థాయిలో సమస్యలు రావచ్చు. రైతుబంధు భూ వివరాల లెక్కల్లో తేడా ఉండడం ఖాయం. సమగ్ర సర్వే జరగకుండా హడావుడిగా ధరణి ప్రారంభించడం వల్ల ఇబ్బందులు తలెత్తే అవకాశం లేకపోలేదు. అందువల్ల భూ సర్వే అన్నది నిరంతరాయంగా జరుపుతూ పోవాలి. గ్రామాలను యూనిట్‌గా తీసుకుని భూముల లెక్కలు తేల్చాలి. వక్ఫ్, దేవాదాయ, ప్రభుత్వ, అటవీభూములకు సంబంధించి ఆటో లాక్ విధించినా..గతంలోనే వాటిని కాజేసిన లేదా.. ఆక్రమించిన, లేదా కౌలు పేరుతో తీసుకుని పట్టాలు చేయించు కున్న వారి వివరాలు కూడా పొందుపరిస్తే ప్రజలకు మేలు జరగగలదు. అయితే ధరణిలో రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ వెంటనే జరిగిపోనున్నందున భూమలుకు సంబంధించిన సమాచారం పక్కాగా ఉండేలా చూడాలి. తప్పయినా, ఒప్పయినా వెంటనే జరిగిపోతుంది. తమ భూముల్లో వ్యత్యాసం ఉన్నపుడు ఇంతకుముందు ఆర్డీవో, జాయింట్ కలెక్టర్ల వద్దకు వెళ్లేవారు. ఇప్పుడు ఆ అవకాశం లేదు. కొత్తగా ఏదైనా సమస్య వస్తే రైతు సివిల్ కోర్టులను ఆశ్రయించాల్సిందే. అయితే ఎంత మంది రైతులు కోర్టులకు వెళ్లగలరు? వెళ్లినా సమస్య ఎప్పటికి పరిష్కారమవుతుంది? అనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. సమగ్ర భూ సర్వే డిమాండ్ ఇప్పటిది కాదు. సర్వే మ్యాప్‌లూ చిరిగిపోయాయి. ఉమ్మడి రాష్ట్రంలో 2010లోనే జరిగిన ఒక సర్వేలో భూములకు సంబంధించి క్షేత్రస్థాయిలో సుమారు 70 రకాల సమస్యలను గుర్తించారు. రాష్ట్ర అవతరణ తరువాత సమగ్ర సర్వే చేయాలని తలపెట్టిన రాష్ట్ర ప్రభుత్వం నిధులు ఇవ్వాలని కేంద్రాన్ని కోరింది. కేంద్రం సుమారు రూ.230 కోట్లను మంజూరు కూడా చేసింది. అయితే ఇప్పటివరకూ సర్వే కొలిక్కి రాలేదు. దీనివల్ల క్షేత్రంలో ఉన్న భూ వివరాలకు, రికార్డుల్లో ఉన్నదానికి తేడా అలాగే కొనసాగుతోంది. రైతులే కాకుండా అటవీ, రెవెన్యూ వంటి శాఖల మధ్య భూ వివాదాలు ఎప్పటి నుంచో ఉ న్నాయి. ఇవన్నీ ఎలా సరిచేస్తారన్నది ప్రభుత్వం చెప్పాలి. 2017లో భూ రికార్డుల అప్‌డేషన్ జరిగింది. ఎలాంటి వివాదం లేని భూముల రికార్డుల శు ద్దీకరణ జరిగింది. వివాదం ఉన్న భూములు, ఆధార్ లేని ఎన్ఆర్ఐల భూములను పక్కన పెట్టేశారు. దీంతో ధరణిలో వ్యవసాయ భూములు కూడా పూర్తిగా చేరలేదు. వివాదాలను తేల్చి పాస్ పుస్తకాలు జారీ చేస్తేనే ఆ భూముల క్రయ విక్రయాలకు అవకాశం ఉంటుంది. రాష్ట్ర రెవెన్యూ రికార్డులను 15 రోజుల్లో తయారు చేయాల్సిందిగా రాష్ట్ర ముఖ్యమంత్రి గతంలో ఆదేశించారు. పాసు పుస్తకాలు డిజిటలైజేషన్ చేసి ఇవ్వడంతోపాటు ధరణి వెబ్‌సైట్‌ను అందుబాటు లోకి తేవాలని నిర్ణయించారు. ప్రస్తుత చట్ట ప్రకారం పట్టాదారులకు మాత్రమే ధరణి వెబ్‌సైట్‌లో వారి ఆస్తుల నమోదు ఉంటుంది. ఈ వెబ్‌సైట్‌లు గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీలలో ఉంటాయి. వీటిని వీఆర్‌ఏలు నిర్వహిస్తారు. అమ్మకాలు, కొనుగోళ్ళు సాగాలన్నా ధరణి వెబ్‌సైట్ నుండి క్లియరెన్స్ పొందాలి. అంటే వీఆర్‌ఏ సర్టిఫికెట్ ఇవ్వాలి. రిజిస్టర్ చేయగానే ధరణి వెబ్‌సైట్‌లో ఆస్తిమార్పిడి జరిగిపోతుంది. అందువల్ల లంచగొండి విధానం నిర్మూలన జరుగుతుందని ప్రభుత్వం, ముఖ్యమంత్రి ప్రకటిస్తున్నారు. అయితే అధికారులు తయారు చేసిన రికార్డులను మాత్రమే నమోదు చేయడం వలన తప్పులు దొర్లినప్పుడు వాస్తవ పట్టేదారు, హక్కుదారు నష్టపోతాడు. ఒకసారి ధరణి వెబ్‌సైట్‌లో నమోదు అయిన తరువాత తిరిగి మార్చాలంటే సివిల్ కోర్టుకు వెళ్ళాల్సిందే. అందువల్ల ధరణి వెబ్‌సైట్ కోసం తయారు చేసే రికార్డులను బహిరంగ పర్చకుండా ఉద్యోగస్తులు, వాటిని వెబ్‌సైట్‌లో నమోదు చేస్తే అనేక తగాదాలు మొదలౌతాయి. ఈ రోజు అనేక రెవెన్యూ సమస్యలతో రైతులు, గ్రామీణ ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడుతు న్నారు. ముఖ్యంగా రెవెన్యూ శాఖ అవినీతి కొరకు కావాలని చేసిన తప్పులకు వారు బలిపశువులు అవుతున్నారు. చాలా మందికి భూమి ఎక్కువ, తక్కువ ఉండటం, పేర్లు అధారం లేకుండా మార్చేశారు. ప్రభుత్వం గానీ, ఉద్యోగులుగానీ, ధరణి వెబ్‌సైట్‌కు ఇచ్చిన వివరాలలో తప్పులు ఉన్నచో వారిపై ఎలాంటి కేసులు పెట్టరాదని సవరణ చేసిన చట్టంలో నిబంధన పెట్టారు. రెవెన్యూ సవరణల పేరుతో చేసిన తప్పులకు రైతులే బాధ్యులు కావాల్సి ఉంటుంది. పైగా గ్రామాలలో జరిగే భూతగాదాలు, సివిల్ కోర్టుకు వెళ్ళాలంటే అధిక ధన వ్యయంతో కూడిన పని. భూదాన యజ్ఞబోర్డు భూములు, కొనుగోలు చేసిన అసైన్డ్ భూములు, తరాలుగా సాగు చేస్తున్న ప్రభుత్వ భూములు వాస్తవ సాగు దారులకు దక్కకుండా పోతున్నాయి. ఈ సమస్యలన్నింటినీ పరిష్కరించాలంటే రాష్ట్ర ప్రభుత్వం భూ సర్వే చేయడం అనివార్యం. సర్వేచేస్తే పాలకవర్గాల భూ బాగోతాలన్నీ బట్టబయలవుతాయి. పేద సాగుదారులకు కొంతైనా న్యాయం జరుగుతుంది. ఇంతకు ముందు భూ భారతి పేరుతో శాటిలైట్ సర్వే విఫలమైంది. ప్రస్తుతం డిజిటల్ పద్దతిలో చేస్తామంటున్నారు. వాస్తవానికి మాన్యువల్‌గా చేయడం వల్ల మాత్రమే న్యాయం జరుగుతుంది. అందువల్ల మొత్తం భూ సమస్య పరిష్కారానికి సర్వే చేయడం మినహా మరో మార్గం లేదు. ధరణి వెబ్‌సైట్ సవరణ చట్టం మాత్రమే భూ సమస్యలను పరిష్కరించలేదన్నది వాస్తవం.

## మార్కెట్‌కు తగ్గిన ఉల్లి లారీల రాక

### రైతు బజార్లలో కిలో 35కే విక్రయం

### కొత్త పంట వస్తేనే ధరలు తగ్గుతాయి

హైదరాబాద్,అక్టోబర్30(ఆర్ఎన్ఎ): దిగుమతులు తగ్గి ఉల్లి ధరలు పెరగడంతో రాష్ట్ర మార్కెటింగ్ శాఖ కేంద్ర ప్రభుత్వ సంస్థ నాఫెడ్‌ను ఆశ్రయించింది. 500 టన్నుల ఇండెంట్ పెట్టగా మొదటి విడతగా 100 టన్నులను సప్లయ్ చేసింది. దీంతో హైదరాబాద్ సిటీలోని 11 రైతు బజార్లలో ఒక్కో వినియోగదారునికి కిలో రూ.35 చొప్పున అందిస్తున్నట్టు మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయి తెలిపారు. మహారాష్ట్రలోని నాసిక్, ఏపీలోని కర్నూల్, మన రాష్ట్రంలోని గద్వాల, మహబూబ్‌నగర్ ప్రాంతాల నుంచి ఉల్లి దిగుమతులు వస్తుంటాయి. రోజుకు 70 నుంచి 100 లారీల వరకు వచ్చే ఉల్లి 35 లారీల లోడ్లు మాత్రమే వచ్చాయి. అదీ నాసిక్, కర్నూల్ నుంచి 5,567 క్వింటాళ్ల పాత ఉల్లిగడ్డలే. హైదరాబాద్‌లోని మలక్‌పేట్ హోల్‌సేల్ మార్కెట్‌లో ఉల్లి గరిష్ట ధర రూ.65 ఉండగా.. బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.80కి పైగా అమ్ముతున్నారు. గత రెండు నెలల కిందట ధరలతో పోలిస్తే ఐదారు రెట్లు అధిక ధరలకు అమ్ముతున్నారు. డిమాండ్‌కు తగిన సరఫరా లేకపోవడంతో ధరలు పెరుగుతున్నాయని మార్కెటింగ్ వర్గాలు వెల్లడిస్తున్నాయి. గత ఆగస్టులో ఉల్లికి రేటు లేక హోల్‌సేల్ మార్కెట్‌లో రూ.5 నుంచి రూ.9లోపే అమ్మారు. సెప్టెంబరులో హోల్‌సేల్ లో రూ.25 నుంచి 35 వరకు విక్రయించారు. అక్టోబర్‌లో రూ.65 నుంచి రూ.100 వరకు పలుకుతోంది. ధరల స్థిరీకరణ చర్యల్లో భాగంగా గతేడాది నాఫెడ్ 52 వేల టన్నుల ఉల్లిని మహారాష్ట్ర, గుజరాత్‌లో కొని నిల్వ చేసింది. గత ఏడాది కూడా సెప్టెంబరు చివరి వారంలో ఎగుమతులపై నిషేధం విధించింది. నిల్వ పరిమితులను చిల్లర వ్యాపారులకు వంద నుంచి ఇరవై క్వింటాళ్లు, హోల్‌సేలర్లకు 500 నుంచి 250కి తగ్గించినప్పటికీ ధరలు తగ్గలేదు. రకరకాల కారణాలు తోడై దిగుమతులు ఆలస్యం కావటంతో లక్ష్యం నీరుగారిపోయింది. ఇటీవల కురిసిన వర్షాలకు ఉల్లిపంట భారీగా దెబ్బతింది. మన రాష్ట్రంలో వానాకాలం పంట పూర్తిగా పోగా.. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, కర్నాటక, గుజరాత్‌తో పాటు ఏపీలోని కర్నూల్ జిల్లాలో 50 శాతం క్రాప్ లాస్ అయ్యింది. దీంతో రాష్ట్రానికి రావాల్సిన ఉల్లి దిగుమతి పడిపోయింది. దీంతో ఉల్లి రేట్లపై ప్రభావం పడుతోంది. క్రాప్ తీసేసి మళ్లీ వేస్తుండడంతో మరో 3 నెలల పాటు ఉల్లి ధరలు తగ్గే పరిస్థితి లేదని మార్కెటింగ్ వర్గాలు చెబుతున్నాయి. మన రాష్ట్రంలోని తాండూరు, నారాయణఖేడ్, కొల్లాపూర్, అలంపూర్, నల్గొండ తదితర ప్రాంతాల్లో ఈ సీజన్‌లో ఉల్లి దాదాపు దెబ్బతిన్నది. వాస్తవానికి రాష్ట్రంలో పండే ఉల్లి అక్టోబర్, నవంబర్ నెలల్లోనే వస్తుంది.

## కంది నుంచి పింపాల్ సాగర్‌కు నాలుగు లేన్లు

### భారతమాల కింద ప్రాజెక్ట్ మంజూరు

సంగారెడ్డి,అక్టోబర్30(ఆర్ఎన్ఎ): మహారాష్ట్ర సరిహద్దు వరకు మరో జాతీయ రహదారి అందుబాటులోకి రానుంది. సంగారెడ్డి జిల్లాలోని కంది నుంచి మహారాష్ట్ర సరిహద్దుల్లోని పింపాల్‌గావ్ వరకు నాలుగు వరుసల మార్గాన్ని నిర్మించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా భారతమాల ప్రాజెక్టు కింద జాతీయ రహదారుల సంస్థ రహదారి విస్తరణ పనులను చేపట్టింది. మొత్తం 135.75 కిలోమీటర్ల పొడవున్న ఈ రహదారిని రూ.3170 కోట్ల వ్యయంతో దీన్ని నిర్మించనున్నారు. దీన్ని కేంద్ర రవాణాశాఖ మూడు ప్యాకేజీలుగా విభజించింది. రెండు ప్యాకేజీలను 2018లో మంజూరు చేయగా, ఇంకా ఆపనులు కొనసాగుతున్నాయి. మరో ప్యాకేజీ పనులను ఎన్‌హెచ్‌ఏ ఖరారు చేసింది. దీంతో మహారాష్ట్ర-తెలంగాణ సరిహద్దులోని పింపాల్‌గావ్ నుంచి నుంచి మొదలయ్యే ఈ మార్గం కంది వరకు వస్తుంది.

## అభినందన్ విడుదలలో ఎలాంటి ఒత్తిళ్లు లేవు

### మాటమార్చిన పాక్ విదేశాంగ ప్రతినిధి

ఇస్లామాబాద్,అక్టోబర్30(ఆర్ఎన్ఎ): వింగ్ కమాండర్ అభినందన్ వర్ధమాన్ విషయంలో కొద్ది గంటల్లోనే పాకిస్థాన్ మాటమార్చింది. అభినందన్‌ను విడుదల చేసే విషయంలో తమపై ఎలాంటి ఒత్తిడి లేదని ప్రకటించింది. వర్ధమాన్ విషయంలో ఆర్మీ చీఫ్ బాజ్వా కాళ్లలో వణుకు పుట్టిందని, ఆయనకు ముచ్చెమటలు పట్టాయని పీఎంఎల్ నేత అయాజ్ సాదిక్ వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే.. అయితే, కొద్ది గంటలకే పాకిస్థాన్ ఈ ప్రకటన చేసింది.. వింగ్ కమాండర్ అభినందన్ వర్ధమాన్ విడుదల విషయంలో పాక్ పై ఎలాంటి ఒత్తిడి లేదని.. కేవలం శాంతిని దృష్టిలో పెట్టుకునే మేం వర్ధమాన్‌ను విడిచిపెట్టాం.. మేం తీసుకున్న ఈ నిర్ణయాన్ని అంతర్జాతీయ సమాజం హర్షించింది.. మాపై ఎలాంటి ఒత్తిళ్లు లేవని ఆదేశ విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి జహీద్ హఫీజ్ చౌధురి చెప్పుకొచ్చారు. భారత్‌పై పాకిస్థాన్ తన అక్కసు వెళ్లగక్కిన సంగతి తెలిసిందే.. జమ్మూకశ్మీర్‌లో పుల్వామా దాడికి తామే కారణమంటూ.. ఇది పాక్ ప్రజల విజయమని ఆదేశ మంత్రి ఫవద్ చౌధురీ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు.. ఏకంగా పాక్ జాతీయ అసెంబ్లీలో.. 'భారత్‌ను వారి గడ్డపైనే దెబ్బకొట్టాం. పుల్వామాలో విజయం సాధించాం. ఇమ్రాన్ నాయకత్వంలో పాక్ విజయం సాధించింది.. అని వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఫవద్ ఈ వ్యాఖ్యలు చేయడానికి కారణం.. ముస్లిం లీగ్ ఎంపీ అయాజ్ సాదిక్. అభినందన్ విషయంలో పాక్ ఆర్మీ చీఫ్ జనరల్ ఖమర్ జావేద్ బజ్వా గజగజ వణికిపోయారని.. సాదిక్ పార్లమెంటులో వివరించారు. మీకు పుణ్యముంటుంది.. అభినందన్‌ను వదిలేయండి .. లేదంటే ఇదే రోజు రాత్రి 9 గంటలకు భారత్ మనపై దాడి చేయడానికి సిద్ధమవుతోందని విదేశాంగ మంత్రి మొహమూద్ ఖురేషీ చెప్పారు. దాంతో అభినందన్‌ను విడుదల చేశారని సాదిక్ చెప్పారు. సాదిక్ వ్యాఖ్యలకు కౌంటర్ ఇచ్చిన ఫవద్.. పుల్వామా ఘటనను సమర్ధించుకుంటూ వ్యాఖ్యలు చేశారు. మొత్తానికి పాక్ తన వక్రబుద్దిని బయటపెట్టుకుంది.

## కొనసాగుతున్న రాజధాని రైతుల ఆందోళన

అమరావతి,అక్టోబర్30(ఆర్ఎన్ఎ): రాజధానిగా అమరావతినే కొనసాగించాలని డిమాండ్ చేస్తూ రైతులు, మహిళలు చేపట్టిన నిరసనలు 318వ రోజుకు చేరుకున్నాయి. మందడం, తుళ్లూరు, వెలగపూడి, వెంకటపాలెం, కృష్ణాయపాలెం, ఎర్రబాలెం, ఉ ద్దండరాయుని పాలెం, రాయపూడి, నీరుకొండ, అనంతవరం, పెదపరిమి, ఐనవోలు, నెక్కల్లు తదితర గ్రామాల్లోని శిబిరాల్లో రైతుల ఆందోళనలు కొనసాగుతున్నాయి. రాజధానిగా అమరావతి కొనసాగుతుందని ప్రభుత్వం చెప్పేవరకు ఆందోళనలు కొనసాగిస్తామని రైతులు స్పష్టం చేశారు. కరోనా సూచనలు పాటిస్తూ అమరావతి ఉద్యమం సాగుతోంది.

## పట్టణీకరణ పట్టు తప్పుతోందా..!

### (31 అక్టోబర్ "ప్రపంచ నగరాల దినం" సందర్భంగా)

ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ 27 డిసెంబర్ 2013న తీసుకున్న 68/239 తీర్మానం ప్రకారం ప్రతియేటా 31 అక్టోబర్‌న 'ప్రపంచ నగరాల దినోత్సవం (వరల్డ్ సిటీస్ డే)' 2014 నుంచి పాటించడం జరుగుతున్నది. ప్రపంచ జనాభాలో దాదాపు సగం పట్టణాలలోనే నివసించడం జరుగుతోంది. వరల్డ్ సిటీస్ డే-2020 నినాదంగా 'వల్యూ అవర్ కమ్యూనిటీస్ అండ్ సిటీస్' తీసుకోబడింది. ప్రపంచ నగరాలు మరియు మహానగరాల స్వచ్ఛత, పట్టణీకరణ సమస్యలు, నగరాభివృద్ధి ఎదుర్కొంటున్న సవాళు ళ్, సుస్థిరాభివృద్ధికి తీసుకోవలసిన జాగ్రత్తలు, నగరాల మధ్య సమన్వయ సహకారాలు వంటి అంశాలను చర్చించే వేదికగా ప్రపంచ నగరాల దినం ఉపయోగపడుతోంది. కోవిడ్-19 విజృంభనతో నగరాలు ఖాళీ చేయబడి గ్రామీణ మరియు మండల కేంద్రాలు జన కళతో నిండాయి. పట్టణీకరణ పెరుగుతున్న నేపథ్యంలో నగరాల చుట్టు మురికివాడలు పుట్టుకురావడం, స్వచ్ఛత లోపించడం, పర్యావరణ సమస్యలు ఉత్పన్నం కావడం, ఆర్థిక సామాజిక సాంస్కృతిక మార్పులు చోటు చేసుకోవడం, ప్రకృతికి విరుద్ధంగా మానవ జీవనశైలి వేగంగా మారడం, రద్దీ పెరగడం, నీటి కొరత ఉత్పన్నం కావడం లాంటి సమస్యలు నగరాలను వెన్నాడుతున్నాయి. భారత ప్రభుత్వం దేశంలోని మహానగరాలు మరియు ముఖ్య పట్టణాల సర్వతోముఖాభివృద్ధి చేయడానికి స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా 'స్మార్ట్ సిటీ' పథకాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టింది.

స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా దేశవ్యాప్త నగరాల స్వచ్ఛ సర్వేక్షణ్-2020 సర్వేలో మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ నగరం క్లీన్ సిటీగా వరుసగా నాలుగవసారి ప్రథమ స్థానంలో నిలిచి ఇతర నగరాలకు ఆదర్శంగా మారింది. స్వచ్ఛ సర్వేక్షణ్ నిర్వహణకు 6000 పాయింట్లతో నగరపౌర సేవలు, పౌరుల అభిప్రాయాలు, ప్రత్యక్ష పరిశీలనలు మరియు టాయిలెట్ల అందుబాటు వంటి అంశాలతో క్లీన్ సిటీల జాతీయ జాబితాను తయారుచేస్తారు. ఒక మిలియన్‌కు పైగా జనాభాగల ఇండోర్ నగరం మె?దటి నుండి ప్రతి సంవత్సరం క్లీన్ సిటీగా ఎంపిక కావడంతో ఈ నగరానికి గుర్తింపు మరియు కీర్తి పెరిగి, విమర్శకులను సైతం విస్మయానికి గురిచేస్తోంది. గతంలో అన్ని నగరాల వలె దుమ్ము, ధూళి, చెత్త చెదారం, మురికి, వీధుల్లో జంతువుల స్వైరవిహారలతో సహజీవనం చేసిన ఇండోర్ నగరవాసులు ఇప్పుడు తమ సిటీని చూసి గర్వపడుతున్నారు. 2016లో మె?దటిసారి నిర్వహించిన స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకింగ్స్ ప్రకారం 25వ స్థానాన్ని కైవసం చేసుకోగా మైసూర్ ప్రథమ స్థానంలో నిలిచింది. ఇదే సంవత్సరం బహిరంగ మల విసర్జన రహిత (ఓపెన్ డిఫొకేషన్ ఫ్రీ, ఒడియఫ్) రెండవ నగరంగా ప్రకటన చేసింది. దీనితో స్ఫూర్తి పొందిన ఇండోర్ నగర పాలక సంస్థ (ఐయంసి) పారిశుధ్య సిబ్బందిని అదనంగా 2000ని నియమించుకొని, మె?త్తం 3500 మంది పారిశుధ్య కార్మికులతో ఇంటింటా తడి పొడి చెత్తను 600 వాహనాలతో సేకరించడానికి రూ.180/- కోట్లు వెచ్చించడం, జరిగింది. ఐయంసి ప్రయత్నానికి ముగ్ధులైన నగర పౌరులు, స్వచ్ఛంధ సంస్థలు, బాధ్యతగల పౌర సమాజం కూడా తమ సహకారం అందించడం ప్రారంభమైంది. ఇంటింట సేకరించిన వ్యర్థాలను రెడ్యూస్, రీయూజ్ మరియు రీసైకిల్ పద్దతిలో చెత్తను విభజించి ప్రాసెస్ చేయడంతో నగర సుందరీకరణకు శ్రీకారం చుట్టబడింది. నగరంలోని 85 డివిజన్ల నుండి 1,115 మిలియన్ టన్నుల చెత్తను సేకరించడం నిత్యకృత్యమైంది. 2017 మరియు 2018ల్లో అత్యంత స్వచ్ఛ (క్లీనెస్ట్) సిటీగా ప్రథమ స్థానంలో నిలవడంతో, తమ గుర్తింపును నిలుపుకునేందుకు 8000 మంది మునిసిపల్ సిబ్బందితో నిత్యం నగర పరిశుభ్రతకు ప్రాధాన్యతనిచ్చారు. స్వచ్ఛ సిటీగా పేరొందిన ఇండోర్‌లో ప్రస్తుతం నగర పౌరులు గర్వంగా, క్రమశిక్షణగా సైనికుల్లా సుందరీకరణలో భాగస్వాములు కావడంతో ప్రభుత్వ ప్రయత్నాలు సులభమైనాయి.

2019లో తిరిగి ప్రథమ స్థానంలో నిలిచిన ఇండోర్ హాట్రిక్ విజయం సాధించింది. 2020లో అగ్రస్థానంలో నిలిచి నాలుగవసారి తన సత్తా చాటుకుంది. 2020 క్లీన్ సిటీల జాబితాలో ఇండోర్ తరువాత సూరత్, నవీ ముంబాయ్, విజయవాడ, అహమ్మదాబాద్, రాజ్‌కోట్, భోపాల్, ఛండీఘర్, విశాఖపట్టణం మరియు వడోదరలు మె?దటి పది స్థానాలలో నిలిచాయి. 2020లో ఉత్తమ గంగా తీర నగరంగా వారణాసి నిలిచింది. ఈ సంవత్సరంలో దేశవ్యాప్తంగా 4,242 నగరాలు, 62 కంటోన్మెంటులు మరియు 92 గంగాతీర నగరాలలోని 1.9 కోట్ల పౌరుల నుండి అభిప్రాయాలు సేకరించడమే కాకుండా వ్యర్థాల నిర్వహణ వ్యవస్థ, మురికి నీటి నిర్వహణ మరియు ట్రీట్‌మెంట్, ఘన కాలుష్య రహిత నగర ప్రయత్నాలు లాంటి అంశాలను పరిశీలించి క్లీన్ సిటీల జాబితాను తయారుచేసి వివిధ వర్గాలలో స్వచ్ఛ మహోత్సవ్-2020 పేరుతో 129 అవార్డులను ప్రకటించారు. ఛత్తీస్‌ఘడ్, ఝార్ఖండ్ మరియు మహారాష్ట్రలు ఉత్తమ రాష్ట్రాలుగా స్వచ్ఛ సర్వేక్షణ్ పథకంలో ముందున్నాయి. క్లీన్ సిటీల జాబితాలో బీహార్‌కు చెందిన పాట్నా, గయ, భాగల్‌పూర్, బ్యూక్సర్, పర్నాబజార్, బీహార్‌షరీఫ్ మరియు సహర్సా నగరాలు చివరలో (డర్టీ సిటీలుగా) ఉ న్నాయి. 4,324 ఓడియఫ్ ప్రాంతాలుగా, 1,808 నగరాలు ఓడియఫ్‌లుగా నిలిచాయి. 2020లో 66 లక్షల గృహాలలో టాయిలెట్లు, 6 లక్షల పబ్లిక్ టాయిలెట్లు నిర్మించడమ జరిగింది. దేశంలో 6 నగరాలు 5-స్టార్, 86 నగరాలు 3-స్టార్ మరియు 64 సిటీలు 1-స్టార్ హోదాను పొందాయి. 2020లో తెలంగాణ రాష్ట్రంలో 23వ స్థానంలో హైదరాబాద్, 73వ స్థానంలో కరీంనగర్ మరియు వరంగల్ 144వ స్థానం పొందింది. ఏపిలో 6వ, 12వ మరియు 17వ స్థానాలలో వరుసగా విజయవాడ, తిరుపతి మరియు విశాఖలు నిలిచాయి.

2019లో ఇండోర్, అంబికాపూర్, మైసూర్, ఉజ్జయిని, న్యూఢిల్లీ, అహమ్మదాబాద్, నవీ ముంబాయ్, తిరుపతి, రాజ్‌కోట్ మరియు దేవాస్ నగరాలు క్లీన్ సిటీల జాబితాలో ముందున్నాయి. 2018లో ఇండోర్, భోపాల్, ఛండీగర్, న్యూఢిల్లీ, విజయవాడ, తిరుపతి, విశాఖపట్టణం, మైసూర్, నవీ ముంబాయ్ మరియు పూనెలు అగ్రస్థానంలో ఉన్నాయి. వరుసగా మూడు సంవత్సరాలు మె?దటి పది స్థానాలలో చోటు దక్కించుకున్న ఇండోర్ (మూడుసార్లు ప్రథమ స్థానం) మరియు నవీ ముంబాయ్ (3వ, 7వ, 9వ స్థానాలు)లు నిలిచాయి. ఆంధ్రప్రదేశ్ నగరాలైన విజయవాడ (4వ, 5వ), విశాఖపట్టణం (9వ, 7వ) మరియు తిరుపతి (8వ, 6వ)లు గత మూడు సంవత్సరాలలో రెండు సార్లు క్లీన్ సిటీల జాబితాల్లో పది స్థానాల లోపు నిలిచాయి. ఇండియాలోని 100 స్మార్ట్ సిటీల జాబితాలో ఏపి నుండి అమరావతి, విశాఖ, కాకినాడ మరియు తిరుపతి నగరాలు ఉన్నాయి. తెలంగాణలో స్మార్ట్ సిటీలుగా వరంగల్ మరియు కరీంనగర్‌లు ఎంపికైనాయని మనకు తెలుసు. తెలుగు రాష్ట్రాలలో ఆంధ్రప్రదేశ్‌లో విజయవాడ, విశాఖ మరియు తిరుపతి నగరాలు ఉత్తమ ర్యాంకుల్లో ఉండగా, తెలంగాణలో వరంగల్ మరియు కరీంనగర్‌లు కొంత వెనుకంజలో ఉండడం బాధను కలిగిస్తున్నది. మన రెండు తెలుగు రాష్ట్రాలు స్వచ్ఛ సర్వేక్షణ్ జబితాలో మె?దటి పదిలోపు ర్యాంకులను పొందాలని బాధ్యతగల తెలంగాణ పౌరులుగా కోరుకుందాం.



- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

## రైతుబంధు వివరాలే ధరణిలో ఉన్నాయా?

### మిగతా భూముల సంగతి మరిచారా
### అన్యాక్రాంతమైన దేవాదాయ,వక్ఫ్ భూముల సంగతి ?
### అనుమానాలకు సమాధానాలు ఇవ్వాల్సింది అధికారులే

హైదరాబాద్,అక్టోబర్30(ఆర్ఎన్ఎ): రైతుబంధు పథకానికి డబ్బుల పంపిణీకి ఉపయోగించిన భూ వివరాలే ఈ పోర్టల్‌లో ఉన్నాయని, సమగ్ర భూ వివరాలు లేవన్న విమర్శలు ఉన్నాయి. దీనిపై అధికారులు వివరణ ఇవ్వాల్సి ఉంది. సుమారు 1.45 కోట్ల ఎకరాల భూములు ధరణిలో దర్శనమిస్తున్నాయి. భూముల క్రయ విక్రయాలకు సంబంధించిన రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ కూడా వెంటనే జరిగిపోనున్నా యి. ఈ రెండూ కూడా తహసీల్దారే చేసేస్తారు. ఇక ధరణిలోకి ఎక్కించిన భూములే ఫైనల్ అన్న అభిప్రాయంతో ప్రభుత్వం నవంబరు 2 నుంచి రిజిస్ట్రేషన్ల కూ అనుమతి ఇచ్చింది. ఇప్పటివరకూ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ జరిగినా పాస్‌బుక్ జారీకి తహసీల్దారు కార్యాలయానికి పంపేవారు. ఆ రిజిస్ట్రేషన్‌కు సంబంధించి గ్రామంలో వారం రోజులపాటు అభ్యంతరాల స్వీకరణను వీఆర్వో చేసేవారు. ఆ తరువాతే పాస్‌బుక్ జారీ అయ్యేది. తాజాగా సబ్ రిజిస్ట్రార్ వద్ద ఉన్న వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్ అధికారాలను ప్రభుత్వం తహసీల్దార్లకు అప్పగించింది. ఇద్దరి బదులు ఇప్పుడు ఒక్కరు అయ్యారు. దానివల్లనే అంతా పారదర్శకం అవుతుం దా? అన్న అనుమానాలు కూడా ఉన్నాయి. రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ చేసే అధికారి.. అంచం అడగరనే గ్యారంటీ ఏమిటని కొంద రు అంటున్నారు. అయితే తహసీల్దార్లకు అధికారం ఇవ్వడం కొత్తేమీకాదని చెబుత న్నారు. ఇక సాంకేతికత అనేది నిరంతరం మారే పక్రియ. దీనిని ఉపయోగించుకొని చాలా రాష్ట్రాలు రెవెన్యూ రికార్డులను ఆన్‌లైన్ చేశాయి. భూముల సమగ్ర సర్వే జరిపినపుడు గజాలు, సెంట్లు లేదా ఎక్కడో ఓ చోట ఎకరాల్లో తేడాలు రావొచ్చు. అప్పుడు ధరణిలో వివరాలను మార్చాల్సి వస్తుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇది ఉండాలంటే సరిహద్దును సూచించే మ్యాపు ఉండాలి. సరిహద్దుల నిర్దేశం తప్పనిసరి చేయాలి. లేకపోతే అమ్మిన వ్యక్తి, కొన్న వ్యక్తి మధ్య వివాదం తలెత్తే అవకాశముంటుంది. ప్రభుత్వం జారీ చేయబోయే మార్గదర్శకాల్లో ఈ విషయం వెల్లడయ్యే అవకాశముంది. కానీ, ఇది ఎప్పుడనే విషయమై ప్రభుత్వం ఇంకా స్పష్టత ఇవ్వలేదు. ఇక ఆటోలాక్‌తో దేవాదాయ, వక్ఫ్ భూములకు రక్షణ కలగనున్నా. ఇప్పటికే ఈ భూములు చాలావరకు అన్యాక్రాంతం అయ్యాయనే ఆరోపణ ఉంది. ఈ నేపథ్యంలో దేవాదాయ, వక్ఫ్ వద్ద ఉన్న భూములనే ధరణిలోకి ఎక్కించడం వల్ల అన్యాక్రాంతమైన వాటిపై ఆశ వదులుకున్నట్లేనా? అన్న ప్రశ్న తలెత్తుతోంది. ఇదే నిజమైతే ఆక్రమణలకు చట్టబద్ధత కల్పించినట్లవుతుందనే అనుమానం వ్యక్తమవుతోంది. ప్రస్తుత ప్రభుత్వం సాగుదారుల హక్కులను గుర్తించకుండా వారిని రెవెన్యూ రికార్డుల నుండి తొలగించారు. ఇంతకు ముందు పట్టేదారే సాగుదారుడు అయితే పట్టా పాసుపుస్తకం, స్వాధీనపు పాసుపుస్తకం అతనికే ఇచ్చారు. ప్రస్తుతం సాగుదారులను తొలగించడంతో కొందరు హక్కులు కోల్పోయారు. తెలంగాణలో భూముల అమ్మకాలు, కొనుగోళ్ళలో రిజిస్ట్రేషన్లు చేసుకోవడం చాలా తక్కువ. భూములు కొనడం, నమ్మకంపై సాగు చేసుకోవడం జరుగుతున్నది. సాదాబైనామాలను కొనుగోలు చేసినట్టు రిజిస్ట్రేషన్ ఫీజు తీసుకొని పట్టా మార్పిడి చేశారు.

అంతేకాక అసైన్డ్ భూములు కొనుగోలు చేసిన అర్హులు, 1950 రక్షిత కౌలుదారీ చట్ట ప్రకారం పట్టా పొంది నేటికి పేరు మార్పిడి జరగని వారు, ప్రభుత్వ భూములు 40 ఏళ్ళకుపైగా సాగు చేస్తున్నవారు నష్టపోతారు. వీరితోబాటు పోడు భూములను సాగుచేసే వారు కూడా నష్టపోతారు. పోడుభూముల సాగుదారులకు శాశ్వత హక్కు కల్పించలేనని సీఎం అసెంబ్లీలో ప్రకటించాడు. అందువల్ల ధరణి వెబ్‌సైట్‌తో నష్టపోయేవారి సంఖ్య 20 లక్షల వరకు చేరుకుంటుంది. ఇకపోతే నిర్ణీత పద్ధతిలో వ్యవసాయం నేర్చుకొన్న తర్వాత భూమికి విలువ పెరిగింది. దేశంలో చాలా మంది చాలారకాల రెవెన్యూ చట్టాలకు, భూ విధానాలకు శ్రీకారం చుట్టారు. కొన్ని ప్రజలకు ఫలితాలనిచ్చాయి. కొన్ని వికటి ంచాయి. రెవెన్యూ బాధలు శాశ్వతంగా పరిష్కారం కావాలని, తెలంగాణ రైతులోకం ఎటువంటి ఆటుపోట్లకు గురికాకుండా వారి భూములకు సంపూర్ణ రక్షణ ఉండాలని ఐదేండ్ల కిందటే నిర్ణయం తీసుకున్నారు. ఇప్పుడు 1,45,58000 ఎకరాల భూముల రికార్డులన్నీ క్లీన్ అయ్యి ధరణి పోర్టల్‌లో దర్శనం ఇస్తున్నాయి. ఈ వివరాలను ప్రపంచంలో ఏ మూలన ఉ న్నవాళ్లయినా చూసుకోవచ్చు. ఎట్టి పరిస్థితుల్లో ఒకరి భూమి ఇంకొకరికి రాయడం, మార్చడం కుదరదు. ఏ అధికారి కూడా వాటిని మార్చలేరని అంటున్నారు. మొత్తంగా ఉద్దేశ్యం మంచిదే అయినా వెనువెంటనే తరుముకుని వచ్చే సమస్యలను ఏ విధంగా పరిష్కరిస్తారన్న దానికి అధికారులు సిద్దంగా ఉండాలి.

## తండ్రీ కొడుకులు కలిసి దోచుకుంటున్నారు

### -దుబ్బాక ప్రచారంలో ఎమ్మెల్యే రాజాసింగ్

సిద్దిపేట,అక్టోబర్30(ఆర్ఎన్ఎ): అయ్య, కొడుకు, అల్లుడు కలిసి తెలంగాణను నాశనం చేస్తున్నారని బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ సీఎం కేసీఆర్ కుటుంబంపై విమర్శించారు. దుబ్బాక బీజేపీ అభ్యర్థి రఘునందన్ రావుకు మద్దతుగా మున్సిపాలిటీ పరిధిలోని లచ్చపేట వార్డులో ఎమ్మెల్యే రాజాసింగ్, మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మినారాయణ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రాజాసింగ్ ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం, శనివారం అక్కడే ఉండనున్నారు. దుబ్బాకలో జరిగేది ఎన్నికలు కాదని.. ఒక యుద్ధమని ఆయన అన్నారు. 'రఘునందన్ రావుపై ఎన్ని కుట్రలు చేస్తుండ్రో మీ అందరికీ తెలుసు. కేంద్రం నుంచి ఒక్క రూపాయి రాలేదంటున్నారు కదా.. ఆ మాటపై నిలబడితే మేం రెడీ. ఎక్కడికి రమ్మంటావో చెప్పు. అయ్య, కొడుకు, అల్లుడు కలిసి తెలంగాణను నాశనం చేస్తున్నారు. బంగారు తెలంగాణ కాలేదు కానీ మత్తు తెలంగాణ అయితే అయింది. తెలంగాణ కోసం ఎంతో మంది యువకులు ప్రాణాలు త్యాగం చేసిండ్రు. నాకు తోడుగా రఘునందన్‌ను అసెంబ్లీకి పంపిస్తే అయ్యాకొడుకులను ఓ ఆట ఆడుకుంటాం. మేమిద్దరం కలిసి తెలంగాణలో బీజేపీ జెండా ఎగురవేస్తాం' అని ఎమ్మెల్యే రాజాసింగ్ అన్నారు.

## నవంబర్‌లో బ్యాంకులకు 8రోజులు సెలవులు

న్యూఢిల్లీ,అక్టోబర్30(ఆర్ఎన్ఎ): దేశంలోని అన్ని ప్రైవేటు, పబ్లిక్ సెక్టార్ బ్యాంకులకు వచ్చే నెలలో 8 రోజుల పాటు సెలవుల రానున్నాయి. పబ్లిక్ హాలిడేలతోపాటు పండుగల సందర్భంగా బ్యాంకులకు 8 రోజులపాటు సెలవులు ప్రకటించారు. దీపావళి, గురునానక్ జయంతి సందర్భంగా నవంబరు నెలలో 8 రోజుల పాటు బ్యాంకులకు సెలవు ప్రకటించారు. నవంబరు నెలలో ఐదు ఆదివారాలు, రెండు శనివారాలు రావడంతో బ్యాంకులకు సెలవు. దీంతోపాటు దీపావళి, గురునానక్ జయంతి సందర్భంగా సెలవులు ప్రకటించారు. నవంబరు నెలలో బ్యాంకులు 8 రోజులు పనిచేయవని, అందువల్ల ఖాతాదారులు సెలవు రోజుల్లో ఆన్‌లైన్, ఇంటర్‌నెట్ బ్యాంకింగ్ సౌకర్యాలను వినియోగించుకోవాలని బ్యాంకు అధికారులు సూచించారు.

## పత్తి కొనుగోళ్లకు అధికారుల చర్యలు

### ఇబ్బందులు రాకుండా ఏర్పాట్లు

వరంగల్,అక్టోబర్30(ఆర్ఎన్ఎ): రైతులు ఎంతో కష్టపడి పండించిన పంటల కొనుగోళ్లకు రాష్ట్ర ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకుంటున్నది. జిల్లాలో ప్రభుత్వ రంగ సంస్థల ద్వారా మద్దతు ధరతో కొనుగోలు చేస్తున్నది. ఈ ఏడాది వానకాలంలో రైతులు సాగుచేసిన పత్తి పంట కొనుగోళ్లు ప్రారంభ మయ్యాయి. వివిధ మండలాలకు చెందిన రైతులు వాహనాల్లో భారీగా పంటను విక్రయానికి తీసుకొచ్చారు. సీసీఐ ఆధ్వర్యంలో మద్దతు ధర క్వింటా లుకు రూ.5,825 చెల్లించి పత్తిని కొనుగోలు చేశారు. రైతులు ఇబ్బందులు పడకుండా మార్కెటింగ్ శాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. తేమశాతాన్ని పరిశీలించడానికి అదనంగా సిబ్బందిని నియమించారు. జిల్లాలో రైతులు ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం వానకాలం పంటలను పూర్తిస్థాయిలో కొనుగోలు చేస్తున్నదని తెలిపారు. మద్దతు ధరతో పంటను కొనుగోలు చేస్తామని తెలిపారు. మంచు కురుస్తుండడంతో తేమ శాతం ఎక్కువగా ఉండే అవకాశాలున్నాయని, రైతులు పంటను ఆరబెట్టుకొని మార్కెట్‌యార్డుకు తీసుకొచ్చి మద్దతు ధర పొందాలని సూచించారు. అమ్మకాల్లో ఇబ్బందులు లేకుండా మార్కెటింగ్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు.

## టీఆర్ఎస్ అభ్యర్థి సుజాతను అత్యధిక మెజార్టీతో గెలిపించాలి

### -కాంగ్రెస్,బిజెపిలకు డిపాజిట్లు రావడం కష్టమే: వంటేరు

సిద్దిపేట,అక్టోబర్30(ఆర్ఎన్ఎ): నవంబర్ 3న దుబ్బాకలో జరుగనున్న ఉప ఎన్నికలో టీఆర్ఎస్ అభ్యర్థి సుజాత అత్యధిక మెజార్టీతో గెలుపొందడం తథ్యమని అటవీ అభివృద్ధి సంస్థ ఛైర్మన్ వంటేరు ప్రతాపరెడ్డి అన్నారు. ఎంత ప్రచారం చేసుకున్నా కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు డిపాజిట్ రాకుండా పోతుందని అన్నారు. ప్రజలను నోట్లతో ప్రలోభపెట్టేందుకు డబ్బుకట్టలు వెదజల్లడం సిగ్గుచేటన్నారు. పీసీసీ అధ్యక్ష పదవిని కాపాడుకోవడం కోసం ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఆ పదవి కోసం రేవంత్‌రెడ్డి ఆరాటపడతున్నారే తప్ప అభ్యర్థి గెలుపుకోసం కాదన్నారు. తెలంగాణలో అన్ని వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తున్నదని అన్నారు. సీఎం కేసీఆర్ చొరవతోనే బడుగు, బలహీన వర్గాల ప్రజలకు సంక్షేమ, అభివృద్ధి ఫలితాలు అందుతున్నా యన్నారు. ఎన్నికల వచ్చినప్పుడు వచ్చే కాంగ్రెస్, బీజేపీ నాయకులు మాటలు నమ్మొద్దన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండే టీఆర్ఎస్ నాయకులకు అండగా ఉ ండాలన్నారు. టీఆర్ఎస్ అభ్యర్థి సోలిపేట సుజాతకు ఓటు వేసి భారీ మెజార్టీని అందిచాలని ఆయన కోరారు. ధరణి పోర్టల్ ద్వారా భూముల వివరాలు ఆన్‌లైన్‌లో పొందుపర్చడం దేశంలోనే గొప్ప నిర్ణయమన్నారు. ధరణి పోర్టల్‌తో మ్యుటేషన్ రిజిస్ట్రేషన్, సాదాబైనామాల విషయంలో రైతులకెంతో మేలు జరుగుతుందన్నారు. ఇదిలావుంటు టీఆర్ఎస్‌ను గెలిపించుకొని, మరోసారి ముఖ్యమంత్రిగా కేసీఆర్‌కు మరింత బలాన్ని అందించాలని దుబ్బాక టీఆర్ఎస్ అభ్యర్థి సోలిపేట సుజాత పిలుపునిచ్చారు. పలు గ్రామాల్లో సోలిపేట సుజాత ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు సుజాతక్కకు బ్రహ్మరథం పట్టారు. ప్రజలనుద్దేశించి ఆమె మాట్లాడారు. అభివృద్ధి వాదులు, అవకాశవాదులకు మధ్య జరుగుతున్న ఎన్నికల్లో అవకాశవాద నాయకులను తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. 70 ఏండ్లలో ఏ ప్రభుత్వాలు చేయని అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను సీఎం కేసీఆర్ అమలు చేసి ఇతర దేశాలకు ఆదర్శంగా నిలిచినట్లు స్పష్టం చేశారు. మిషన్ భగీరథ ప్రాజెక్టు ద్వారా ఇంటింటికి స్వచ్ఛమైన తాగునీరు అందిస్తున్నారన్నారు. టీఆర్ఎస్‌ను ఎదుర్కొనే సత్తాలేకనే బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు అసత్య ప్రచారాలకు పూనుకున్నాయన్నారు. మరోసారి ఉద్యమ స్ఫూర్తిని చాటాలని సోలిపేట సుజాత పిలుపునిచ్చారు. మల్లన్నసాగర్ పూర్తయితే, నియోజకవర్గం లోని లక్షా 35 వేల ఎకరాలకు సాగునీరు, ఇండ్లు లేని వారందరికీ డబుల్ బెడ్‌రూం ఇండ్లను అందిస్తా మన్నారు. దివంగత ఎమ్మెల్యే సోలిపేట రామలింగన్నా ఆశయ సాధనకు పని చేస్తానని, నియోజకవర్గ ప్రజలే దేవుళ్లని, వారి కష్ట సుఖాల్లో పాలు పంచుకొని సీఎం కేసీఆర్ తనపై ఉంచిన నమ్మకాని నిలబెట్టుకుంటానన్నారు.

# పునర్నవికి కాబోయే భర్తపై వీడిన సస్పెన్స్

హైదరాబాద్,అక్టోబర్30(ఆర్ఎన్ఎ): పిట్టగోడ, ఉయ్యాల జంపాల, మళ్లీమళ్లీ ఇది రాని రోజు వంటి చిత్రాల్లో నటించిన పునర్నవి బిగ్ బాస్ సీజన్ 3 కార్యక్రమంతో తెలుగు ప్రేక్షకులకి చాలా దగ్గరైంది. ముఖ్యంగా ఈ షో రాహుల్ సిప్లిగంజ్‌తో ఆన్ స్క్రీన్ రొమాన్స్ చేస్తూ అందరి నోళ్ళల్లో నానింది. బిగ్ బాస్ హౌజ్‌లో వీరి ప్రవర్తన చూస్తే బయటకు వచ్చాక తప్పక పెళ్ళి చేసుకుంటారేమో అనే అనుమానం అందరిలో కలిగింది. పలు ఇంటర్వ్యూలకు కూడా రాహుల్,పునర్నవి ఇద్దరు కలిసి హాజరు కాగా, ఆ సమయంలో వీరిని.. మీ ఇద్దరి మధ్య ఉన్నది ప్రేమ, స్నేహమా అని ప్రశ్నించారు. దానికి స్నేహమే అని సమాధానం ఇచ్చారు. కట్ చేస్తే బుధవారం రోజు తనకు ఎంగేజ్‌మెంట్ అయిందని చేతికి ఉన్న రింగ్ ఫోటో షేర్ చేస్తూ అందరికి షాక్ ఇచ్చింది పునర్నవి . దీంతో ఈ అందాల బొమ్మ పెళ్ళి చేసుకునే వ్యక్తి ఎవరు అని ఆరాలు తీయడం మొదలు పెట్టారు నెటిజన్స్. దీంతో తనకు కాబోయే భర్తని పరిచయం చేసింది ఈ ముద్దుగుమ్మ. అతని పేరు ఉద్భవ్ రఘునందన్ కాగా, అతను యాక్టర్, రైటర్, ఫిలిం మేకర్ కూడా. నేడు పునర్నవి, ఉద్భవ్‌ల పెళ్ళి జరగనుందని సమాచారం

# సింగర్ కార్తీక్‌ను ఎలా ప్రోత్సహిస్తారు: చిన్మయి

చెన్నై,అక్టోబర్30(ఆర్ఎన్ఎ): దర్శకుడు మణిరత్నం తన తదుపరి ప్రాజెక్ట్‌గా 'నవరస'ను ప్రకటించిన సంగతి తెలిసిందే. తొమ్మిది కథలు, తొమ్మిది మంది దర్శకులతో వెబ్ సిరీస్ లో ఈ చిత్రాన్ని రూపొందించ నున్నారు. ఈ వెబ్ సిరీస్‌కు ప్రముఖులతో పాటు ప్రముఖ సినిమాటోగ్రాఫర్స్,సంగీత దర్శకులు ఈ సినిమా కోసం పని చేయబోతున్నారు. అలాంటి వెబ్ సిరీస్ పై మీటూ చిన్మయి సంచలన వ్యాఖ్యలు చేసింది. ఈ సినిమాకు సింగర్ కార్తీక్ పనిచేస్తున్నారు. దీంతో మీటూ వ్యవహారంలో ఆరోపణలు ఎదుర్కొన్న కార్తీక్‌ను ఈ సినిమాలో పని చేయించడంపై నెటిజన్స్ అభ్యంతరం వ్యక్తం చేశారు. దీనిపై చిన్మయి స్పందిస్తూ.. మీరు ఎటువంటి వారికి అవకాశాలు ఇస్తున్నారో ఒకసారి చూసుకోండి అంటూ మణిరత్నంను టా÷–గ్గ్ ÷ట్ చేసి విమర్శలు చేసింది. వేధింపులకు గురిచేసిన వ్యక్తికి అండగా నిలబడటం సరికాదంటూ ట్వీట్ చేసింది. పనిలేక బాధపడుతున్న మాలాంటి బాధితులకు మాత్రం మీరు పని ఇవ్వరు అంటూ అసహనం వ్యక్తం చేసింది.

# కలర్ ఫోటోకు జగపతిబాబు ప్రశంసలు

## –ఓ మంచి సినిమా అని కితాబు

హైదరాబాద్,అక్టోబర్30(ఆర్ఎన్ఎ): తనదైన యాక్టింగ్, డైలాగ్ డెలివరీతో టాలీవుడ్ నటుడు జగపతిబాబు క్లాస్, మాస్ ప్రేక్షకాభిమానులను సంపాదించుకున్నాడు. లెజెండ్ సినిమాతో నెగెటివ్ షేడ్స్‌లో నటించిన జగ్గూభాయ్ పాత్రకు ప్రశంసల వర్షం కురిసింది. సుహాస్, చాందినీ చౌదరి కాంబినేషన్ లో వచ్చిన చిత్రం కలర్ ఫోటో. ఇటీవలే విడుదలైన ఈ చిత్రం విమర్శకుల ప్రశంసలు అందుకుంటోంది. విలేజ్ బ్యాక్ డ్రాప్ లో సాగే ప్రేమకథను ప్రేక్షకుల మనస్సుకు హత్తుకునేలా తీశాడు డైరెక్టర్. ఈ చిత్రంపై జగపతిబాబు ప్రశంసలు కురిపించాడు. 'కలర్ ఫోటో చూశాక సంతోషంగా ఫీలయ్యా. సుహాస్ హీరోగా తనను తాను ప్రూవ్ చేసుకున్నాడు. డైరెక్టర్ ఈ వయస్సులోనే మంచి సినిమా తీశాడు. కాల భైరవ మ్యూజిక్ కు చాలా ఇంప్రెస్ అయ్యా. డబ్బులు..స్టార్ డమ్ ఈ సినిమాను హిట్ చేయలేదు. అందరి మనస్సుకు హత్తుకుపోయేలా గొప్పగా ఉండటం వల్లే సాధ్యమైంది. యువనటీనటులు తమ క్రియేటివిటీతో సహజసిద్ధంగా ఇలా సినిమా చేయగలిగారని చాలా సార్లు నేను ఆశ్చర్యపోయానని' ట్వీట్ చేశారు. ఇలాంటి చిత్రాల్లో నటించడం నాకు చాలా ఇష్టం. చాలా మంది తనను డబ్బు ట్యాగ్ తో నన్ను సంప్రదించారని.. లేదా చిన్న హీరో సినిమాలో ఇలాంటి పాత్ర చేస్తానా..? అని అనుకొని ఉండొచ్చని అభిప్రాయపడ్డాడు జగ్గూభాయ్. కాలాన్ని మార్చే ఇలాంటి గొప్ప సినిమాల్లో తాను నటిస్తానని చెప్పుకొచ్చారు జగపతిబాబు.

# అధికార పార్టీ ఆగడాలను అడ్డుకోండి

## –దుబ్బాక ఉప ఎన్నికపై ప్రత్యేకాధికారికి బిజెపి ఫిర్యాదు

సిద్దిపేట,అక్టోబర్30(ఆర్ఎన్ఎ): దుబ్బాక ఉప ఎన్నికలో అధికార పార్టీ ఆగడాలను అడ్డుకోవాలని ఉప ఎన్నికల పోలీస్ ప్రత్యేక పరిశీలకుడు సరోజ్ కుమార్ ఠాకూర్‌కు బిజెపి నేతలు ఫిర్యాదు చేశారు. ఇటీవలి సిద్దిపేట ఘటనతో పాటు స్థానికంగా అనేక విషయాలను వారుఆయనతో ప్రస్తావించారు. జిల్లా కేంద్రంలోని మిషన్ భగీరథ గెస్ట్ హౌస్‌లో ఉప ఎన్నికల పోలీస్ ప్రత్యేక పరిశీలకుడు సరోజ్ కుమార్ ఠాకూర్‌తో బీజేపీ నాయకులు నల్లు ఇంద్రసేనారెడ్డి, మాజీ ఎంపీ జితేందర్ రెడ్డి భేటీ అయ్యారు. ఈ సందర్భంగా దుబ్బాకలో జరుగుతున్న పరిస్థితులపై వినతి పత్రం సమర్పించారు. అనంతరం బీజేపీ నేతలు మీడియాతో మాట్లాడారు.

దుబ్బాక ఉప ఎన్నిక పోలీస్ అబ్జర్వర్‌కు ఇక్కడ జరుగుతున్న అన్ని విషయాలను వివరించామని ఇంద్రసేనారెడ్డి తెలిపారు. పోలీస్‌లు బైండోవర్ పేరిట కార్యకర్తలను అరెస్ట్ చేస్తున్నారని మండిపడ్డారు. పోలింగ్ రోజు దౌర్జన్యం చేసే అవకాశం ఉందని అందుకు అవసరమగు పోలీస్ సిబ్బంది పెంచాలని వివరించామని చెప్పారు. గత వారం రోజులుగా పోలీసులు బంది సంజీవ్, కార్యకర్తలపై, అభ్యర్థి మామ ఇంటిపై జరిగిన విషయాన్ని పోలీస్ ప్రత్యేక పరిశీలకుడికి వివరించామని తెలిపారు. బీజేపీ సంస్కారం లేని పార్టీ అని కేటీఆర్ మాట్లాడే ముందు ఆయన తండ్రి కేసీఆర్‌ను సంస్కారం నేర్చుకోమని చెప్పాలని హితవు పలికారు. కేసీఆర్‌కు సంస్కారం లేదని... సీఎం, పీఎంలను ఎవరిని పడితే వారిని ఇష్టారీతిలో మాట్లాడటం సరికాదన్నారు. సంస్కారం లేకపోతే కేటీఆర్ దగ్గర నేర్చుకోవాల్సిన పరిస్థితి లేదని వ్యాఖ్యానించారు. కేసీఆర్ తెలుగు భాషకు, సంస్కృతికి వక్రబుద్ధి చెప్పారని ఇంద్రసేనారెడ్డి విమర్శించారు. జితేందర్ రెడ్డి మాట్లాడుతూ.... గత వారం రోజుల నుండి పోలీసులు చేసిన దేవేందర్‌పై సరోజ్ కుమార్‌కు వివరించామని తెలిపారు. పోలీసులు టీఆర్ఎస్ పార్టీకి తొత్తులుగా వ్యవహరించిన విషయాన్ని పోలీస్ అబ్జర్వర్‌కు వివరించినట్లు చెప్పారు. ప్రశాంత వాతావరణంలో ప్రచారం చేసుకోవడానికి సహకరిస్తామని సానుకూలంగా స్పందించారని తెలిపారు. పోలీస్ స్పెషల్ అధికారి సరోజ్ కుమార్ ఠాకూర్ మాట్లాడుతూ.... దుబ్బాక ఉప ఎన్నికల్లో ఏదైనా సమస్యలు తలెత్తితే 9445437356 నంబర్‌కి కాల్ చేయాలన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నిక జరిగేందుకు అందరూ సహకరించాలని కోరారు.

# ఎదురుకాల్పుల్లో మహిళా మావోయిస్ట్ మృతి

రాయ్‌పూర్,అక్టోబర్30(ఆర్ఎన్ఎ): ఎదురుకాల్పుల్లో ఓ మహిళా మావోయిస్టు మృతిచెందింది. ఈ ఘటన ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లా చింతగుఫ అటవీప్రాంతంలో చోటుచేసుకుంది. చింతల్నార్ పోలీస్ స్టేషన్ పరిధిలోని దుబ్బల్, మిన్పా గ్రామాల మధ్య ఎస్టీఎఫ్, డీఆర్జీ, సీఆర్పీఎఫ్, కోబ్రా దళాలు సంయుక్తంగా గాలింపు చర్యలు చేపట్టాయి. ఈ సందర్భంగా మావోయిస్టులు తారసపడటంతో ఇరువర్గాల మధ్య ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి. కాల్పుల అనంతరం భద్రతా దళాలు ఆ ప్రదేశాన్ని పరిశీలించగా ఓ మహిళా మావోయిస్టు మృతదేహం లభ్యమైంది. అదేవిధంగా సంఘటనా స్థలం నుంచి 303 రైఫిల్‌తో పాటు, భారీగా పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నట్లు బస్తర్ రేంజ్ ఐజీ పి. సుందర్‌రాజ్ తెలిపారు. మృతిచెందిన మహిళా మావోయిస్టును ఇంకా గుర్తించాల్సి ఉందన్నారు.

# ఫ్రాన్స్‌లో మరోమారు ఉగ్రదాడి

## కత్తితో తల నరికిన దుండగుడు

## ఘటనలో మరో ఇద్దరు మృతి

పారిస్,అక్టోబర్30(ఆర్ఎన్ఎ): ఫ్రాన్స్ నగరం నీస్‌లో గురువారం జరిగిన ఉగ్ర దాడిలో మహిళ సహా ముగ్గురు మరణించారు. కత్తితో చర్చిలో ప్రవేశించిన ఆగంతకుడు మహిళపై దాడి చేసి ఆమె తలను నరికేశాడని మరో ఇద్దరిని ఈ ఘటనలో మరణించారని అధికారులు తెలిపారు. ఇది ఉగ్రవాద చర్యేనని నీస్ మేయర్ క్రిస్టియన్ ఎస్ట్రోసి వెల్లడించారు. నగరంలోని నాట్రెడామ్ చర్చిలో ఈ ఘటన జరిగిందని, దాడికి పాల్పడిన దుండగుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారని తెలిపారు. దాడికి తెగబడిన వ్యక్తి ఓ మాటను పదేపదే నినాదాలు చేశాడని చెప్పారు. మరణించిన వారిలో ఒకరిని చర్చి వార్డెన్‌గా భావిస్తున్నామని మేయర్ పేర్కొన్నారు. బాధితులను కిరాతకంగా చంపారని అన్నారు. నిందితుడు పారిపోతుండగా పోలీసులు కాల్పులు జరిపారని ప్రస్తుతం నిందితుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడని చెప్పారు. కాగా, ఈ దాడిలో ముగ్గురు మరణించారని, పలువురికి గాయాలయ్యాయని పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై ఫ్రాన్స్ ఉగ్రవాద వ్యతిరేక ప్రాసిక్యూషన్ విభాగం దర్యాప్తు చేపట్టనుంది. ఫ్రాన్స్‌లో ఈ తరహా దాడి ఈ నెలలో ఇది రెండవది కావడం గమనార్హం. ఫ్రెంచ్ మిడిల్ స్కూల్ టీచర్‌ను ఇటీవల చెచెన్యా సంతతికి చెందిన ఓ వ్యక్తి తలనరికి చంపడం కలకలం రేపింది.

# రైతు వేదికల ప్రారంభోత్సవానికి సిద్దమైన కొడకండ్ల

**భారీగా ఏర్పాట్లు చేసిన అధికారులు**
**భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన పోలీసులు**
**ఇక్కడికి సిఎం రావడం అదృష్టమన్న మంత్రి ఎర్రబెల్లి**

జనగామ,అక్టోబర్30(ఆర్ఎన్ఎ): వరంగల్ జిల్లాలోని కొడకండ్ల మండల కేంద్రంలో రైతువేదికను సిఎం కెసిఆర్ శనివారం ప్రారంభించబోతున్నారు. ఈ మేరకు భారీగా ఏర్పాట్లు చేశారు. సిఎం రాకతో భారీగా బందోబస్తు ఏర్పాటు చేశారు. మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు స్వయంగా దగ్గరుండి ఏర్పాట్లను పర్యవేక్షించారు. రైతు బాగుంటేనే దేశం బాగుంటుందనే భావనతో కర్షకులకు టీఆర్ఎస్ సర్కారు వెన్నుదన్నుగా నిలుస్తున్నదని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. రైతు వేదికలకు కొడకండ్లలో శ్రీకారం చుట్టేందుకు ముఖ్యమంత్రి రావడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. వ్యవసాయంలోని ఒడిదుడుకులు, కష్టనష్టాలు తెలిసిన మహానుభావుడు కేసీఆర్ ముఖ్యమంత్రి కావడంతో చరిత్రలో ఏనాడు లేని విధంగా వ్యవసాయ రంగంలో కీలక సంస్కరణలకు అడుగు పడిందన్నారు. భూరికార్డుల ప్రక్షాళన సహా ధరణి పోర్టల్, రైతుబంధు, రైతుబీమా వంటి కార్యక్రమాలు దేశానికి దిక్సూచిగా నిలుస్తున్నాయన్నారు. పల్లె ప్రకృతి వనాన్ని సుందరంగా తీర్చిదిద్దుతున్నామని మంత్రి అన్నారు. తొలుత రైతు వేదికను ప్రారంభించిన తర్వాత ముఖ్యమంత్రి సమీపంలోని పల్లె ప్రకృ తి వనాన్ని సందర్శిస్తారని చెప్పారు. గుట్టల మధ్య నీటి కొలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. లబ్ధిదారుల కోసం సిద్ధం చేసిన డబుల్ బెడ్ రూం ఇళ్లను ప్రారంభించి మార్కెట్ యార్డు ఆవరణలో ఏర్పాటు చేసే సభలో 5వేల మంది రైతులతో ముఖాముఖి మాట్లాడుతా రని మంత్రి ఎర్రబెల్లి తెలిపారు. రాష్ట్రంలో రూ.573 కోట్లతో 2604 రైతు వేదికలను ప్రభుత్వం నిర్మిస్తున్నదని, ప్రతి 5వేల మంది రైతులకు ఒక రైతు వేదికను ఏర్పాటు చేస్తున్నామన్నారు. రైతు వేదికలు, వాటి ఆవశ్యకత ఏంటన్నది కొడకండ్ల సభలో సిఎం కెసిఆర్ రైతులకు వివరిస్తారు. వ్యవసాయ రంగానికి మరింత ఊతమిచ్చేందుకు టీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రమంతటా రైతు వేదికలు నిర్మిస్తుండగా రాష్ట్రంలోనే మొదటిసారిగా జనగామ జిల్లా కొడకండ్లలో రైతు వేదికను ప్రారంభించేందుకు సిఎం కేసీఆర్ ఈనెల 31న రానున్నారు. కొడకండ్ల మండల కేంద్రంలో శనివారం మధ్యాహ్నం 12.30 గంటలకు రైతు వేదికను ప్రారంభించి ఇక్కడి పల్లె ప్రకృతి వనాన్ని సందర్శిస్తారు. అనంతరం వ్యవసాయ మార్కెట్ ఆవరణలో ఏర్పాటు చేసిన రైతుసభా వేదిక నుంచి ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. తర్వాత ఐదు వేల మంది రైతులతో సీఎం కేసీఆర్ ముఖాముఖి మాట్లాడుతారు. రైతు వేదికల ఉద్దేశం, వాటి ఆవశ్యకత, వాటి ద్వారా రైతులకు కలిగే ఉపయోగాలను వివరిస్తారు. ఈ కార్యక్రమాలకు ఉమ్మడి జిల్లాలోని రైతుబంధు సమితి గ్రామ, మండల, జిల్లా ప్రతినిధులు హాజరుకానున్నారు. వ్యవసాయశాఖ మంత్రి ఎస్ నిరంజన్‌రెడ్డి, ఉమ్మడి జిల్లా మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతిరాథోడ్, రైతు బంధు సమితి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులు పాల్గొంటారు. ముఖ్యమంత్రి పర్యటనకు జిల్లా అధికార యంత్రాంగం యుద్ధప్రాతిపదికన ఏర్పాట్లు పూర్తి చేస్తున్నది. మండల కేంద్రంలో హెలిప్యాడ్‌ను సిద్ధం చేయగా, పోలీసులు భారీ బందోబస్తు కల్పిస్తున్నారు. సీఎం పర్యటించే ప్రాంతాన్ని ఇప్పటికే తమ ఆధీనంలోకి తీసుకున్నారు.



జనగామ జిల్లా కొడకండ్లలో రైతువేదిక ప్రారంభోత్సవానికి సిఎం రానుండడంతో ఏర్పాట్లను పరిశీలించిన మంత్రులు ఎర్రబెల్లి, నిరంజన్ రెడ్డి, సత్యవతి, మాజీ డిప్యూటీ సిఎం కడియం

# కరోనాతో ఇప్పుడే జాగ్రత్తలు అవసరం

**నిర్లక్ష్యం చేస్తే మరింత ప్రమాదం**
**యూరప్ దేశాల్లో మాదిరి విజృంభించే అవకాశం**

న్యూఢిల్లీ,అక్టోబర్30(ఆర్ఎన్ఎ): కరోనా ఇప్పుడు రెండో,మూడోదశకు చేరుకుందన్న వార్తలు ప్రజలను కలవరానికి గురి చేస్తున్నాయి. ఎలాంటి లక్షణాలు అంటే జలుబు, జ్వరం వంటివి లేకుండానే కరోనా సోకుతోంది. దీంతో పాటు మూడ్రోజుల్లోనే దీని ప్రభావం తీవ్రంగా ఉందని ప్రపంచ ఆరోగ్య సంస్థ చేస్తున్న హెచ్చరికల నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. ఈమధ్య కరోనా తీవ్రత ఎక్కువగా వున్నట్టు కనబడుతున్న కర్ణాటక, కేరళల్లో కూడా కొత్త కేసులు తగ్గాయి. కానీ ప్రధాని నరేంద్ర మోదీ ఇటీవల జాతినుద్దేశించి ప్రసంగించిన సందర్భంగా చెప్పినట్టు కరోనా తగ్గుముఖం పట్టినట్టు కనబడుతున్నా అప్రమత్తత ఏమాత్రం సడలనీయకూడదు. మాస్క్ ధరించడంతో మొదలుపెట్టి ముందు జాగ్రత్తల్లో దేన్నీ నిర్లక్ష్యం చేయకూడదు. కరోనా తీవ్రత తగ్గినట్టు కనిపించడంతో చాలామందిలో ఒకరకమైన నిర్లక్ష్య ధోరణి బయల్దేరింది. కొందరు శాస్త్రవేత్తలు భారత్‌లో ఇప్పటికే కరోనా వైరస్ ఉచ్చస్థితికి వెళ్లి, అక్కడినుంచి వెనక్కి రావడం మొదలైందంటున్నారు. మనకిక రెండో దశ బెడద ఉండకపోవచ్చునని చెబుతున్నారు. ఇదే తీరు కొనసాగితే వచ్చే ఫిబ్రవరినాటికల్లా ఈ మహమ్మారి విరగడకావొచ్చునని అంచనాలు వేస్తున్నారు. కానీ ముందుజాగ్రత్త చర్యల్ని విస్మరించేవారు వైరస్ బారిన పడడం ఖాయమని హెచ్చరిస్తున్నారు. అందువల్లే వ్యాక్సిన్ వచ్చేవరకూ ఇప్పుడమలవుతున్న జాగ్రత్తలన్నీ పాటించకతప్పదు.

యూరప్ దేశాలన్నీ కరోనా వైరస్ రెండో దశ విజృంభణతో కుదేలవుతున్న వేళ మన దేశంలో తొలిసారి ఆ మహమ్మారి క్రమేపీ ఉపశమిస్తున్న జాడలు కనిపిస్తున్నాయి. కరోనాపై మనం పోరు ప్రారంభించి దాదాపు ఏడు నెలలు కావస్తుండగా జూలై నుంచి అది విస్తరిస్తూ పోయింది. నియంత్రణ విధానాలను విస్మరిస్తే ఏమవుతుందో ప్రస్తుతం యూరప్ దేశాలనూ, అమెరికానూ చూస్తే అర్థమవుతుంది. ముఖ్యంగా యూరప్ దేశాలన్నీ ఇంచుమించుగా కరోనా బారినుంచి బయటపడి ఆర్థిక కార్యకలాపాలు ప్రారంభించడం మొదలుపెట్టాయి. పరిమితంగా అయినా పరిశ్రమలు తెరుచుకోవడం, రవాణా సదుపాయాలు సాధారణ స్థితికి చేరడం, మళ్లీ జనం రోడ్లపై సందడి చేయడం కనబడింది. వృధా ప్రయాణాలు మానుకోవాలని, సాధ్యమైనంతవరకూ ఇళ్లకే పరిమితం కావాలని నిపుణులు సూచిస్తున్నారు. కలిసికట్టుగా నిబంధనలు పాటించడం వల్లే వైరస్ తొలి దశ దాడినుంచి కనిష్ట నష్టాలతో బయట పడగలిగామని, ఇప్పుడు సైతం దాన్ని మరిచిపోవద్దని విజ్ఞప్తిచేశారు. యూరప్ దేశాల పరిస్థితి ప్రస్తుతం అయోమయంగా వుంది. కరోనా తొలి దశ విజృంభణ నుంచి బయట పడ్డాక నెమ్మదిగా యధాపూర్వ స్థితికి వస్తున్న తరుణంలో రెండో దశ విజృంభణ వుట్టుకొచ్చి అంతంతమాత్రంగా కోలుకుంటున్న ఆర్థిక వ్యవస్థల్ని చిక్కుల్లో పడేసింది. జర్మనీ, ఫ్రాన్స్, బ్రిటన్, స్పెయిన్, నెదర్లాండ్స్‌లు గతవారం మళ్లీ కఠినమైన ఆంక్షల్ని అమలు చేయడం మొదలుపెట్టాయి. ఇవి ఇంకా పెరుగుతాయని రెండు మూడు రోజులుగా నాయకులు చెబుతున్నారు. కరోనా బయటపడిన తొలి నాళ్లలో కేరళ దాన్ని సమర్థవంతంగానే ఎదుర్కొంది. వరసబెట్టి తీసుకున్న చర్యల కారణంగా అక్కడ కేసుల సంఖ్య రోజుకు కేవలం రెండు, మూడు మాత్రవే వెల్లడైన సందర్భాలున్నాయి. కానీ ఈమధ్య అవి మళ్లీ పెరుగుతున్నాయి. దీని వెనకున్న కారణాలేమిటో నిపుణులు నిర్దిష్టంగా చెప్పలేకపోతున్నారు. కానీ కేసుల సంఖ్య గణనీయంగా తగ్గడం మొదలయ్యాక జనాన్ని హెచ్చరించడంలో ప్రభుత్వాలు విఫలం కావడం వల్ల వరసగా వచ్చిన పండగల్లో జాగ్రత్తలు తీసుకోవడం తగ్గిందని, అందుకే కేసులు పెరిగాయని అంటున్నారు. రవాణా సదు పాయాలను కొనసాగిస్తూనే, ఇతరత్రా కార్యకలాపాలకు చోటిస్తూనే నిరంతరం అందరూ అప్రమ త్తంగా వుండకతప్పదు. ఎక్కడ లోపం జరిగినా పరిస్థితి మొదటికొచ్చే ప్రమాదం వుంటుంది.

# ఉల్లిధరలపై పట్టింపులేని ప్రభుత్వాలు

**ధరలు దాడి చేస్తున్నా తగ్గించే ప్రయత్నాలు మృగ్యం**
**వర్షాలతో బాగా దెబ్బతిన్న రైతులు**

న్యూఢిల్లీ,అక్టోబర్30(ఆర్ఎన్ఎ): ఉల్లి ధరలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆలోచించడం మానేశాయి. ధరలు పెరుగుతున్నా వాటిపై దృష్టి సారించడం లేదు. దీంతో పక్షం రోజుల్లోనే ఉల్లి దరలు మూడింతలు పెరిగాయి. గత ఏడాది ఇదే సమయంలో ఉల్లి ధరలు కొన్ని చోట్ల కిలో రూ.160 నుంచి 180 వరకు పలికాయి. తిరిగి ఈ ఏడాది అదే పునరావృతం కానుందన్న సూచనలు కనిపిస్తున్నాయి. ఉల్లి ధరల గురించి కేంద్రం తీసుకుంటున్న చర్యలు కూడా పెద్దగా ప్రభావం చూపడం లేదు. తమిళనాడులో కిలో ధర రూ. 120 నుంచి రూ. 130 వరకు పెరిగినట్లు వార్తలు వచ్చాయి. మరోవైపు కేంద్ర ప్రభుత్వం ఒక ప్రకటన చేస్తూ సగటున ఉల్లి ధర దేశంలో కిలో రూ. 55.60 ఉన్నదని, ఢిల్లీలో రూ.50 ఉన్నట్లు ప్రకటించింది. గత ఏడాది అక్టోబరు 20వ తేదీన ఉల్లి ధరలతో పోలిస్తే అదే రోజున ఈ ఏడాది 12.61 శాతం పెరిగినట్లు కేంద్ర ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపింది. ఇటీవల కేంద్ర ప్రభుత్వం సవరించిన నిత్యావసర వస్తువుల చట్టం చెప్పినదాన్ని బట్టి ధరల పెరుగుదల గురించి ఆందోళన చెందాల్సిన పని లేదన్నది ప్రభుత్వ ప్రకటన సారంగా చెప్పుకోవాలి. ఉల్లి, పప్పుధాన్యాలు, ఖాద్య తైలాలు, నూనె గింజలు, తృణధాన్యాలు, బంగాళా దుంపల నిల్వలకు సంబంధించి ఎలాంటి పరిమితులు ఉండవు, ఎన్నయినా చేసుకోవచ్చని తాజా చట్ట సవరణ తెలిపింది. అయితే పంటలకు అనుకూలమైన నేలలు ఉన్నా రైతులకు ప్రోత్సాహం లేకపోవడంతో పంటలకు రైతులు ఆసక్తి చూపడం లేదు. మన దేశంలో ఉల్లి ఏడాదికి మూడు పంటలు పండుతుంది. వేసవి పంట ఏప్రిల్‌లో, ఖరీఫ్ తొలి పంట సెప్టెంబరు, ఖరీఫ్ రెండవ పంట నవంబరు తరువాత మార్కెట్‌కు వస్తుంది. వర్షాలు, వాటితో వచ్చే తెగుళ్ల కారణంగా కొంత పంట నష్టం జరిగిందని, పది శాతం ఉల్లి విత్తనాల కొరత, రబీ పంటలో నిల్వ చేసినదానిలో 35 శాతం పాడైపోవటం ప్రస్తుత ఉల్లి ధరల పెరుగుదలకు కారణాలుగా చెబుతున్నారు. ఉల్లి వ్యాపారం మొత్తం ప్రయివేటు వ్యాపారుల చేతుల్లోనే ఉంది. గత ఏడాది ధరలు పెరిగడంతో వారు దీనిని సొమ్ము చేసుకున్నారు. రాబోయే రోజుల్లో కొరత ఏర్పడనుందని చెప్పడం ద్వారా వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టించటం స్పష్టంగా కనిపిస్తోంది. ముందస్తు చర్యగా సెప్టెంబరు 14న కేంద్ర ప్రభుత్వం ఉల్లి ఎగుమతులపై నిషేధం విధించింది. ధరలను అదుపులో ఉంచేందుకు కేంద్ర ప్రభుత్వం నిల్వ చేసిన ఉల్లిని విడుదల చేస్తున్నది. రాబోయే రోజుల్లో మరింతగా విడుదల ఉంటుంది. డిసెంబరు 15 వరకు దిగుమతులను సులభతరం చేస్తూ 2003 నాటి ఉత్తరువులను కేంద్ర ప్రభుత్వం సడలించింది. విదేశాల నుంచి దిగుమతి చేసుకొనే సరకుతో వచ్చే తెగులు, ఇతర వాటి నివారణకు దిగుమతి చేసుకొనే ఉల్లిని శుభ్రం చేసేందుకు అవసరమైన చర్యలను...ఓడలకు ఎక్కించే చోట గాకుండా మన దేశంలో దిగుమతి చేసే చోట చేపట్టేందుకు కూడా సవరణలు చేసింది. ఇది సక్రమంగా జరగకపోతే కొత్త సమస్యలు తలెత్తవచ్చు. మనం పది శాతం ఎగుమతులు చేస్తున్నాము. ధరలు పెరిగినపుడు నిషేధిస్తున్నాము. గత నాలుగు దశాబ్దాలుగా తరచూ ఉల్లి రాజకీయాలు ముందుకు వస్తున్నాయి. 1980 లోక్‌సభ ఎన్నికలలో కాంగ్రెస్ నేత ఇందిరా గాంధీ ఉల్లిని ఎన్నికల సమస్యగా ముందుకు తెచ్చారు. తరువాత కూడా ఎన్నికల సమయంలోనూ తరువాత ప్రతిపక్షాల అస్త్రంగా మారింది. 1998లో ఢిల్లీలో బిజెపి ప్రభుత్వం ఉల్లి ధరల కారణంగానే ఓడిపోయిందని విశ్లేషించారు. తరువాత కాలంలో ఎవరు అధికారంలో ఉన్నా ఉల్లి ధరలు చర్చకు వస్తూనే ఉన్నారు. అయితే చాలావరకు పంట నష్టపోవడంతో ఉల్లి దిగుబడిపై ఎఫెక్ట్ పడింది. ఒక వైపు వినియోగదారులు కొనుక్కునేందుకు ఇబ్బందులు పడుతుంటే.. పంట అమ్ముకునే రైతుకు ఫలితం దక్కడం లేదని, దళారులే బాగుపడుతున్నారనే విమర్శలు వస్తున్నాయి.

# ఘాట్‌రోడ్డులో బోల్తాపడ్డ పెళ్లివ్యాను

## –ఆరుగురు మృతి..కొందరికి గాయాలు

కాకినాడ,అక్టోబర్30(ఆర్ఎన్ఎ): పెళ్లివ్యాను బోల్తా పడి ఆరుగురు మృతిచెందారు. ఈ ఘోర సంఘటన తూర్పుగోదావరి జిల్లా గోకవరం మండలం తంటికొండ ఘాట్‌రోడ్డులో వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద చోటుచేసుకుంది. పెళ్లికి హాజరై తెల్లవారుజామున 3.30 గంటల సమయంలో తిరిగి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. బ్రేక్ ఫెయిల్ కావడంతో వ్యాను కొండపై నుంచి కింద పడింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన నలుగురిని రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతులను గోకవరం మండలం టాకుర్‌పాలెం గ్రామానికి చెందిన వారిగా గుర్తించారు. ఘటన సమాచారం అందుకున్న పోలీసులు, స్థానికులు సహాయ చర్యలు ప్రారంభించారు. తంటికొండ ఘాట్ రోడ్డులో వెంకటేశ్వరస్వామి దేవాలయం వద్ద శుక్రవారం తెల్లవారుజామున పెళ్లి బృందం ఉన్న వ్యాను బోల్తా పడడంతో ఆరుగురు మృతి చెందారు.

మరో నలుగురికి తీవ్రగాయాలయ్యాయి. మృతుల్లో ఇద్దరు మహిళలు, ఇద్దరు చిన్నారులు ఉన్నారు. ఆలయంలో పార్కింగ్ ప్లేస్ మీదుగా రోడ్డు మీదికి రావాల్సిన వ్యాన్ మెట్లు పై నుంచి ఒక్కసారిగా కింద పడినట్లు పోలీసులు తెలిపారు. ప్రమాద సమయంలో వ్యాన్‌లో 17 మంది పెళ్లి బృందం ఉన్నారు. మతులు శ్రీదేవి, శ్రీలక్ష్మి, భాను, ప్రసాద్, దొరగా పోలీసులు గుర్తించారు. వధువు.. స్వస్థలం రాజానగరం మండలం వెలుగుబంద కాగా, వరుడు స్వస్థలం గోకవరం మండలం ఠాకూర్‌పాలెంకి చెందిన వారిగా గుర్తించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

# ఉప ఎన్నికలో కాంగ్రెస్ విజయం తథ్యం

## ధూమ్‌ధామ్‌గా శ్రీనివాస రెడ్డి ప్రచారం

## డప్పులతో స్వాగతం పలికిన ప్రజలు

సిద్దిపేట,అక్టోబర్30(ఆర్ఎన్ఎ): దుబ్బాక ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ విజయం తథ్యమని దుబ్బాక కాంగ్రెస్ అభ్యర్థి చెరకు శ్రీనివాసరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. అప్పన్నపల్లిలో ఆయన ధూంధాంగా ప్రచారం చేపట్టారు. అధికార టీఆర్ఎస్ పార్టీకి చెంపదెబ్బ ఖాయమని అన్నారు. కల్లిబొల్లి మాటలు చెప్పి అన్ని వర్గాలను మోసం చేసిన కేసీఆర్, హరీశ్‌రావులను ప్రజలు విశ్వసించడంలేదని అన్నారు. ఈ ఎన్నికలో వారికి చెక్ పెట్టేందుకు ఓటర్లు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. ప్రశ్నించే గొంతుక, నిలదీసి, తిరగబడి ప్రజల తరపున మాట్లాడే వ్యక్తి చెరుకు శ్రీనివాసరెడ్డి మాత్రమేనని అన్నారు. మాజీ మంత్రి ముత్యంరెడ్డి చేసిన అభివృద్ధిని నియోజకవర్గంలోని ప్రతీ పల్లెలో కనినిస్తోందని, ఎన్నికల్లో తమ పార్టీ గెలుపునకు అదే ప్రధాన అస్త్రం కాబోతోందన్నారు.ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ తరపున చేగుంట మండలంలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ ఉప ఎన్నికలో కాంగ్రెస్ విజయం ఖాయమైందన్నారు. టీఆర్ఎస్ పరిస్థితి రోజురోజుకూ దిగజారుతోంది. కచ్చితంగా ఈ ఉప ఎన్నికలో విజయం మాదే అందులో ఎటువంటి సందేహం లేదన్నారు. నియోజకవర్గంలో ముత్యంరెడ్డి చేసిన అభివృద్ధి తప్ప.. టీఆర్ఎస్, బీజేపీ చేసిందేమీ లేదన్నారు. టీఆర్ఎస్ పార్టీ ముత్యంరెడ్డిని మోసం చేసింది. మంత్రిగా, ఎమ్మెల్యేగా ఆయన చేసిన అభివృద్ధి పనులు ప్రచారం సందర్భంగా మేం ఏ ఇంటికి వెళ్లినా ప్రజలు గుర్తు చేసుకుంటున్నారు. నిరంతరం పేదల కోసం పని చేసిన ముత్యంరెడ్డి కొడుకు శ్రీనివాసరెడ్డి అని ప్రజలు తనను ఆదరిస్తున్నారని అన్నారు. డబుల్ బెడ్రూమ్ ఇళ్లు, దళితులకు మూడెకరాలు భూమి, ఇంటికో ఉద్యోగం, గిరిజనులు, మైనార్టీలకు రిజర్వేషన్లు పెంపు వంటి హామీలను కేసీఆర్ తుంగలో తొక్కారని ఆయన తన ప్రచారంలో ప్రస్తావిస్తున్నారు.టీఆర్ఎస్, బీజేపీ రెండూ పార్టీలు ఒకటేనన్న విషయం అర్థం చేసుకుని ఈసారి కాంగ్రెస్ వైపు మొగ్గు చూపుతున్నారని అన్నారు. ఈ ప్రభుత్వంలో ఏ వర్గం ప్రజలూ సంతోషంగా లేదన్నారు.

నియోజకవర్గంలో కొన్ని రోజులుగా ప్రచార బాధ్యతలు నిర్వరిస్తున్నా.. వెళ్లిన ప్రతి చోటా ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. టీఆర్ఎస్, బీజేపీ పాలన పట్ల ప్రజలు విసిగిపోయి ఉన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను నియోజకవర్గంలోని ప్రతి ఇంటింటా తెలియజెప్పాం. ముఖ్యంగా రైతులు, మహిళలు, యువత తీవ్ర అంసతృప్తితో ఉన్నారని అన్నారు. ప్రజల గుండెల్లో ఉన్న ముత్యంరెడ్డి తనయుడిని గెలిపిస్తే తమ ఆకాంక్షలను అసెంబ్లీలో వినిపిస్తాడని నియోజకవర్గ ప్రజలు గట్టిగా నమ్ముతున్నారని శ్రీనివాస రెడ్డి అన్నారు. ఆయన ప్రచారానికి రాగా డప్పులతో స్వాగతం పలికారు.

# సింగరేణి గనిలో మృతి చెందిన నవీన్

## –కోటి రూపాయల పరిహారం కోసం కార్మికుల డిమాండ్

పెద్దపల్లి,అక్టోబర్30(ఆర్ఎన్ఎ): రామగుండం వకీల్‌పల్లి బొగ్గు గనిలో గురువారం జరిగిన ప్రమాదంలో మృతి చెందిన నవీన్ మృతదేహాన్ని వెలికి తీసారు. బొగ్గు పొరల కింద చిక్కుకొని ఓవర్‌మెన్ నవీన్ మృతిచెందాడు. మృతదేహాన్ని రెస్క్యూ సిబ్బంది వెలికితీసింది. 12 గంటల పాటు శ్రమించి రెస్క్యూ సిబ్బంది మృతదేహాన్ని బయటకు తీసింది. మృతదేహాన్ని సింగరేణి ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుని కుటుంబానికి కోటి రూపాయల ఎక్స్‌గ్రేసియా, ఒకరికి ఉద్యోగం ఇవ్వాలంటూ కార్మిక సంఘాల ఆందోళన చేపట్టాయి. ప్రమాదానికి కారణమైన అధికారులపై చర్యలు తీసుకోవాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేశాయి.

# సాగర్ గేట్లు మూసివేత

నల్లగొండ,అక్టోబర్30(ఆర్ఎన్ఎ): ఎగువ నుంచి నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు వరద తగ్గిపోయింది. దీంతో అధికారులు ప్రాజెక్టు క్రస్టు గేట్లన్నిటినీ మూసివేశారు. సాగర్‌కు ప్రస్తుతం 45,619 క్యూసెక్కుల వరద వస్తున్నది. అంతే మొత్తం నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 312.04 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 311.44 టీఎంసీలు ఉన్నాయి. జలాయశయంలో పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు. ఇప్పుడు 589.80 అడుగుల నీటిమట్టం ఉన్నది.మహబూబ్‌నగర్ జిల్లాలోని జూరాల ప్రాజెక్ట్‌కు వరద ప్రవాహం తగ్గుముఖంపట్టింది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 318.516 మీటర్లు కాగా 318.350 మీటర్లకు చేరింది. అలాగే పూర్తిస్థాయి నీటినిల్వ 9.657 టీఎంసీలు. ప్రస్తుతం 9.316 టీఎంసీల నీరు నిల్వ ఉన్నది. ఎగువ నుంచి 88,800 క్యూసెక్కుల నీరు వస్తుండగా, తొమ్మిది గేట్ల ద్వారా 97,809 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

# దుబ్బాకలో ప్రశాంత ఎన్నికలకు ఆదేశించండి

## ఎన్నికల సంఘాన్ని కోరిన కాంగ్రెస్

## లేఖ రాసిన ఎంపి కోమటిరెడ్డి

హైదరాబాద్,అక్టోబర్30(ఆర్ఎన్ఎ): దుబ్బాకలో టీఆర్ఎస్ దుర్మార్గంగా వ్యవహరిస్తోందని కాంగ్రెస్ నేత మర్రి శశిధర్‌రెడ్డి మండిపడ్డారు. తాము అడిగితే పోస్టల్ బ్యాలెట్ లిస్ట్ ఇవ్వలేదని ఆయన తెలిపారు. ఈ మేరక తెలంగాణ ఎన్నికల ప్రధానాధికారిని కాంగ్రెస్ నేతలు కలిసి ఫిర్యాదు చేశారు. పెద్దగుండవెల్లిలో టీఆర్ఎస్ సర్పంచ్ దగ్గర లిస్ట్ ఉందని, లిస్ట్‌లో ఉన్న వారిని టీఆర్ఎస్ బెదిరించి ప్రలోభపెట్టాలని చూస్తోందని మండిపడ్డారు. ఎన్నికలు సజావుగా నిర్వహించాలని, లేకుంటే నిలిపివేయాలని, దుబ్బాకలో కేంద్ర బలగాలను దింపాలని మర్రి శశిధర్‌రెడ్డి డిమాండ్ చేశారు. అంతకుముందు కేంద్ర ఎన్నికల కమిషనర్‌కు కాంగ్రెస్ ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి లేఖ రాశారు. దుబ్బాకకు కేంద్ర బలగాలను పంపాలని లేఖలో కోరారు. ఉప ఎన్నికలను స్వేచ్ఛగా.. పారదర్శకంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. టీఆర్ఎస్, బీజేపీలు అక్రమ మార్గంలో గెలిచేందుకు ప్రయత్నాలు చేస్తున్నాయని పేర్కొన్నారు. బీజేపీ అభ్యర్థి బంధువు ఇంట్లో డబ్బులు దొరికాయని వెంకట్‌రెడ్డి గుర్తుచేశారు. ఉప ఎన్నికను స్వేచ్ఛగా.. పారదర్శకంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. టీఆర్ఎస్, బీజేపీలు అక్రమ మార్గంలో గెలిచేందుకు ప్రయత్నాలు చేస్తున్నాయని పేర్కొన్నారు. ఇక మంత్రి హరీశ్ రావు తన అధికారాన్ని ఉపయోగించి ప్రత్యర్థి పార్టీ నాయకులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల నిబంధనలు అతిక్రమించి అక్రమాలకు పాల్పడుతున్న వారిపై మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ కింద కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దుబ్బాకలో ప్రతి మండలానికి కనీసం ఒక కేంద్ర పరిశీలకుడిని పంపాలని, రాష్ట్ర పోలీసులు, జిల్లా అధికారులను తక్షణమే దుబ్బాక నుంచి తరలించాలని లేఖలో కోమటిరెడ్డి కోరారు.

# యాదాద్రిలో నాబార్డు సీజేఎం పూజలు

యాదాద్రి భువనగిరి, అక్టోబర్ 30 : యాదాద్రి లక్ష్మీ నరసింహస్వామిని నాబార్డ్ సీజేఎం వై. కృష్ణారావు సతీ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. బాలాలయంలో స్వామి వారి ఆశీస్సులు, తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం సీజేఎం ఆలయ పునర్నిర్మాణ పనులను పరిశీలించారు. ఆలయ నిర్మాణం అద్భుతమని కొనియాడారు. ఏండ్ల క్రితం దేవాలయాలు నిర్మించినట్లు విన్నామని, తాజాగా చూస్తున్నామని తెలిపారు. తెలంగాణ దేవాలయాలకు పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నం బాగుందని కితాబిచ్చారు. ఆయన వెంట ఉమ్మడి నల్లగొండ డీడీఎం సత్యనారాయణ తదితరులు ఉన్నారు.



యాదాద్రిని దర్శించుకున్న నాబార్డు సిజెఎం వై. కృష్ణారావు దంపతులు

# దుబ్బాక ఫలితంతో కెసిఆర్‌కు కనువిప్పు కల్పించాలి

## డబుల్ ఇళ్లు, దళిత సిఎం, మూడెకరాల హామీలు ఏమయ్యాయి
## దుబ్బాక ప్రచారంలో బిజెపి నేత వివేక్ వెంకటస్వామి

సిద్ది పేట,అక్టోబర్30(ఆర్ఎన్ఎ): దుబ్బాక ఉప ఎన్నికలో సీఎం కేసీఆర్‌కు కనువిప్పు కలగాలంటే టీఆర్ఎస్ను ఓడించాలని బీజేపీ నేత, మాజీ ఎంపి వివేక్ పిలుపునిచ్చారు. కెసిఆర్ ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలుకాలేదన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు, డబుల్ ఇళ్లు , దళిత ముఖ్య మంత్రి హామీలు ఏమయ్యా యని అన్నారు. చేగుంట మండలంలోని పలుగ్రామాల్లో ఆయన ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దుబ్బాక ఉప ఎన్నికలోనూ బీజేపీ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తంచేశారు. దుబ్బాకలో రోజురోజుకూ బీజేపీకి అనుకూలంగా సర్వేలు వస్తుండడంతో టీఆర్ఎస్ పార్టీ అధికార దుర్వినియోగానికి పాల్పడి గెలవాలని చూస్తుందని విమర్శించారు. దుబ్బాకలో టీఆర్ఎస్ పార్టీకి ఓటమి భయం పట్టుకుందని, అందుకే బీజేపీపై దాడులు చేయిస్తున్నారని మండిపడ్డారు. దుబ్బాక నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే, సీఎం కేసీఆర్ మెడలు వంచి నిధులు తేచ్చే సత్తా రఘునందన్‌రావుకే ఉందని తెలిపారు. దుబ్బాకలో కాషాయజెండా ఎగురబోతుందని ధీమా వ్యక్తం చేశారు. దుబ్బాక ఎన్నికల ఫలితాలు కేసీఆర్, హరీశ్‌రావు అహంకారానికి చెంపపెట్టు కావాలని పిలుపునిచ్చారు. ఎన్నికల తర్వాత హరీశ్‌రావు తనంతట తానే కాల్చుకునే పరిస్థితి వస్తుందని విమర్శించారు. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తరువాత మొట్ట మొదటగా దళితులనే మోసం చేసిన వ్యక్తి సీఎం కేసీఆర్ అని మాజీ ఎంపీ వివేక్‌వెంకటస్వామి మండిపడ్డారు. స్వరాష్ట్రంలో మొట్టమొదటి దళితుడిని సీఎం చేస్తానని చెప్పి, తానే సీఎం కుర్చీలో కూర్చొని దళితులను మోసం చేశారని మండిపడ్డారు. డబుల్‌బెడ్రూం ఇళ్లు, నిరుపేదలకు మూడెకరాల భూమి హామీలను తుంగలో తొక్కారని ధ్వజమెత్తారు. దుబ్బాకలో బీజేపీతోనే దళితులకు సరైన న్యాయం జరుగుతుందని తెలిపారు. దుబ్బాక ఉప ఎన్నికల తీర్పుతో సీఎం కేసీఆర్ మైండ్‌బ్లాక్ కావాలన్నారు. అధికార దుర్వినియోగానికి పాల్పడి గెలవాలని చూస్తున్న కేసీఆర్‌కు భంగపాటు తప్పదని స్పష్టం చేశారు.

దుబ్బాకలో ఆరేళ్ల జరగని అభివృద్ధి దివంగత ఎమ్మెల్యే సోలిపేట రామలింగారెడ్డి సతీమణి సుజాత గెలిస్తే ఇప్పుడెలా చెందుతుందని ప్రశ్నించారు. దుబ్బాకలో ఎన్ని కుట్రలు చేసినా బీజేపీ గెలుపును ఆపలేరని, ఇక్కడ కాషాయం జెండా ఎగురటం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. సమాజంలో చివరి వ్యక్తి వరకు ప్రభుత్వాలు అందించే అభివృద్ధి, సంక్షేమ ఫలాలను అందించాలన్న లక్ష్యంతో బీజేపీ పార్టీ రూపుదిద్దు కున్నదని తెలిపారు. బడుగు బలహీన వర్గాలకు మేలు చేయటమే లక్ష్యంగా మోదీ ఆధ్వర్యంలోని బీజేపీ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు.

# తెచ్చుకున్న తెలంగాణలో అభివృద్ధి సాగాలి

## కెసిఆర్ నాయకత్వాన్ని బలోపేతం చేద్దాం
## దుబ్బాక ప్రచారంలో పద్మాదేవేందర్ రెడ్డి

సిద్ది పేట,అక్టోబర్30(ఆర్ఎన్ఎ): తెచ్చుకున్న తెలంగాణలో నిరంతర అభివృద్ధి జరగాలంటే దుబ్బాకలో టిఆర్ఎస్ గెలుపు అనివార్యమని మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి అన్నారు. సిఎం కెసిఆర్‌కు అండగా ఉ



దుబ్బాకలో సోలిపేట సుజాతకు మద్దతుగా ప్రచారంలో పాల్గొన్న పద్మాదేవేందర్ రెడ్డి తదితరులు

ంటేనే అభివృద్ధి పథకాలు ముందుకు సాగుతాయన్నారు. దుబ్బాక ఉప ఎన్నిక ప్రచారంలో టీఆర్ఎస్ అభ్యర్థి సోలిపేట సుజాత దూసుకెళ్తున్నది. ఊరూరా ప్రజలు బతుకమ్మలు, బోనాలతో సుజాతకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. శుక్రవారం రాయపోల్ మండలంలోని తిమ్మక్కపల్లి, రాయపోల్ మండల కేంద్రంలో మెదక్ ఎమ్మెల్యే పద్మా దేవేందర్‌రెడ్డి, మాజీ మంత్రి సునీతా లక్ష్మారెడ్డితో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..ఓటేసి ఆశీర్వదించండని ఓటర్లను అభ్యర్థించారు. ఇప్పుడిప్పుడే మన కష్టాలను సీఎం కేసీఆర్ తీరుస్తున్నారు. ఇది రైతు ప్రభుత్వం. రైతులను రాజును చేయాలనీ సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ కరెంట్ ఇయ్యక చంపితే.. బీజేపీ మోటార్లకు మీటర్లు పెడతారట. కారు గుర్తుకు ఓటేసి బీజేపీకి గుణపాఠం చెప్పాలన్నారు. సునీతా లక్ష్మారెడ్డి మాటా ్డుతూ..బీజేపీ ప్రభుత్వం రైతులను మోసం చేస్తుందని విమర్శించారు. వ్యవసాయాన్ని వ్యాపారంగా మారుస్తున్నారని మండిపడ్డారు. దుఃఖంతో సుజాతక్క మీ ముందుకు వచ్చింది. కారు గుర్తుకు ఓటేసి ఆశీర్వదించండి ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. తనను గెలిపిస్తే దివంగత రామలింగారెడ్డి ఆశయాలను కొనసాగిస్తానని సుజాత తెలిపారు. దుబ్బాకను రామలింగారెడ్డి అభివృద్ధి చేశారు. నాకు మరింత అభివృద్ధి చేసే అవకాశం కల్పించండని ఓటర్లను అభ్యర్థించారు. మంత్రి హరీష్ రావు, ఎంపీ ప్రభాకం^న్నల సహకారంతో నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని హామీనిచ్చారు.

# నగరంలో ఆగని వరదబాధితుల ఆందోళన

## ఆర్థిక సాయం కొందరికే ఇస్తున్నారని నిరసన
## అధికారుల, నేతల తీరుపై బస్తీవాసుల మండిపాటు

హైదరాబాద్,అక్టోబర్30(ఆర్ఎన్ఎ): వరదబాధితులకు సాయం అందడం లేదని పలుచోట్ల ఆందోళనలు వ్యక్తం అవుతున్నాయి. కేవలం కార్పొరేటర్ల అజమాయిషీలోనే పంపిణీ జరుగుతోందని విమర్శించారు.

శుక్రవారం కూడా పలుచోట్ల బాధితులు ఆందోళనకు దిగారు. నగరంలోని గుడిమల్కాపూర్ డివిజన్‌లో వరద బాధితులు ఆందోళనకు దిగారు. ప్రభుత్వం ప్రకటించిన ఆర్థిక సాయం తమకు అందటంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్పొరేటర్ చెప్పిన 50 మందికి మాత్రమే డబ్బులు అందిస్తున్నారని మండిపడ్డారు. వరదల్లో నీట మునిగిన 300 కుటుంబాలను గాలికి వదిలేసారని అన్నారు. కార్పొరేటర్ బంగారు ప్రకాష్ అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపించారు. ఆయన దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఇకపోతే పలుచోట్ల వరుసగా బాధితులు రోజూ ఆందోళన చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన వరద సాయంపై నిరసనలు వ్యక్తం అవుతున్నాయి. తమకు పరిహారం అందడం లేదంటూ చాలా చోట్ల బాధితులు ఆందోళనలు చేస్తున్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, కార్పొరేటర్ల ఎదుటనే ధర్నాకు దిగుతున్నారు. టీఆర్ఎస్ అనుచరులకే సాయం చేస్తున్నారని, అసలైన బాధితులను పట్టించుకోవడం లేదని ఆరోపిస్తు న్నారు. కొన్ని చోట్ల లీడర్లు, అధికారులు కలిసి సాయంలో కోతపెడుతున్నారు. రికార్డుల్లో రూ.10 వేలు ఇచ్చినట్లు రాసుకుని, రూ.5 వేలే ఇస్తున్నారని కూడా ఆరోపిస్తున్నారు. కొన్నిచోట్ల అసలు ఇవ్వకున్నా ఇచ్చినట్లు రాసుకుని వెళ్తున్నారు. మరికొన్ని చోట్ల లీడర్లు డబ్బు పంచి వెళ్లాక.. వారి అనుచరులు వచ్చి మళ్లీ కొంచెం వెనక్కి తీసుకుంటున్నారు. ఇలా ఎక్కడ చూసినా ఏదో ఒక గొడవ జరగడంతో రూ.10 వేల సాయం అందని బాధితుల ఆందోళనలు రోజురోజుకూ ఎక్కువవుతున్నాయి. నీట మునిగిన ప్రాంతాల జనాలకు ప్రభుత్వం రూ.10 వేల ఆర్థిక సాయం ప్రకటించింది. ఇందుకు 235 ప్రాంతాలను గుర్తించగా, ఇందులో స్థానిక కార్పొరేటర్, రెవెన్యూ, జీహెచ్ఎంసీ సిబ్బంది కలిసి నీట మునిగిన ప్రాంతాల జనాలకు సాయం అందజేస్తున్నారు. కొన్ని చోట్ల అసలైన బాధితులకు ఇవ్వకుండా పార్టీ అనుచరులకు రూ.10 వేలు ముట్టజెప్ప డంతో బాధితులు రోడ్డెక్కుతున్నారు. మా ఇండ్లన్నీ నీళ్లలో మునిగిపోయాయి.. ఇప్పటిదాకా మాకు వరద సహాయం అందలేదు.. కొంచెం మాపై దయుంచి వరద హాయం అందించండని పలుచోట్ల ప్రజలు వేడుకుంటున్నారు.

# ఘనంగా మిలాద్ ఉన్ నబీ వేడుకలు




రాజన్న సిరిసిల్లా, అక్టోబర్ 30 (నేటినిజం ప్రతినిధి):మహమ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకొని వేములవాడ పట్టణంలో జామ , మదీనా మజీద్ ఆధ్వర్యంలో మిలాద్ ఉన్ నబీ కార్యక్రమాన్ని ముస్లీం సోదరులు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ముస్లిం సోదరులు తిప్పాపూర్ బిడ్జీ నుండి అలయ ప్రధాన రహదారి గుండా మార్కెట్‌యార్డు వరకు ర్యాలీ నిర్వహించారు.

ఈ సందర్భంగా కో ఆప్షన్ మేంబర్ బాబును మాట్లాడుతూ మహమ్మద్ ప్రవక్త జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని ఆయన చూపిన మార్గాల్లో నడవాలని పిలుపునిచ్చారు . వారు సూచించిన మార్గాలు శాంతికి దోహదపడతాయన్నారు.సర్వ మానవాళి సంక్షేమం కోసం కృషి చేశారన్నారు. ఆయన జీవితం ఆదర్శనీయమన్నారు .

ఈ కార్యక్రమంలో ముస్లిం నాయకులు పీర్ మహమ్మద్ మహమ్మద్ రఫిక్,అంజత్ పాషా, బుర్హాన్, అబ్దుల్ రజాక్,ఖాదర్ , పర్వేజ్,అసద్, జబ్బార్ , వసీమ్, నదీం సోహెల్, అషిం ఖాన్,సభీల్ లతో పాటు ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

# సెస్ కార్యాలయంలో దాడికి పాల్పడడం అమానుషం...



రాజన్న సిరిసిల్లా, అక్టోబర్ 30 (నేటినిజం ప్రతినిధి):సెస్ కార్యాలయంలో తనపై దాడి చేయడం ఎంతవరకు సమంజసమని చందుర్తి సెస్ డైరెక్టర్ అల్లాడి రమేష్ అన్నారు, శుక్రవారం ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో భాగంగా ఛాంబర్ కూర్చుండగా చార్వాక ట్రస్ట్ చైర్మన్ దప్పుల అశోక్ లింగంపేట, జోగాపూర్ అనుబంధ గ్రామం గుడి పేటకు చెందిన కొంతమంది వ్యక్తులు వచ్చి లింగంపేట లో చార్వాక ట్రస్టు కు విద్యుత్ కలెక్షన్ ఇవ్వాలని నానా బూతులు తిడుతూ తనపై దాడికి పాల్పడ్డారని అల్లాడి రమేష్ తెలిపారు, ట్రస్టుకు విద్యుత్ కనెక్షన్ ఇచ్చే అధికారం సెస్ ఏఈ ఉంటుందని, కార్యాలయంలో సంబంధిత అధికారికి దరఖాస్తు చేసుకుంటే లైన్ మంజూరు చేస్తారని ఇది కాకుండా సెలవు రోజు సెస్ కార్యాలయానికి వచ్చి కక్షపూరితంగా తనపై హత్యాయత్నం చేశారని, ఈ సంఘటనపై చందుర్తి పోలీస్టేషన్లో ఫిర్యాదు చేయడం జరిగిందని తనపై దాడికి యత్నించిన నిందితులపై చర్యలు తీసుకోవాలని సెస్ డైరెక్టర్ అల్లాడి రమేష్ డిమాండ్ చేశారు,

# సజావుగా సచివాలయ పోస్టుల నియామకం

## పారదర్శకంగా సర్టిఫికెట్ల పరిశీలన
## జిల్లా కలెక్టర్ రేవు ముత్యాల రాజు

ఏలూరు,అక్టోబర్ 30(ఆర్ఎన్ఎ): జిల్లాలో గ్రామ వార్డు సచివాలయ పోస్టుల నియామకానికి సర్టిఫికెట్లు వెరిఫికేషన్ నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ రేవు ముత్యాల రాజు అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంబంధిత శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత అనుభవాలను తీసుకుని సచివాలయం పోస్టుల నియామక ప్రక్రియ సజావుగా, సక్రమంగా , పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. నియామక ప్రక్రియ నిర్ణయించిన సమయం ప్రకారం అన్ని పనులు పూర్తి కావాలని ఆయన సూచించారు . రిజర్వేషన్ విధిగా పాటించాలని ,అభ్యర్థుల శాఖల వారీగా అభ్యర్థుల మెరిట్ జాబితా, ఇ-జీబబివ వారీగా మెరిట్ జాబితాలను సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు .జిల్లాలో18 రకాల ఉద్యోగాలకు 1049 పోస్టులకు నవంబర్ 2వ తేదీ నుండి 5వ తేదీ వరకు కాల్ లెటర్ లు అభ్యర్థులకు పంపించడం జరుగుతుందని, 5 వ తేదీ నుండి 10వ తేదీ వరకు సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుందని ,10వ తేదీన నియామక పత్రాలు అందజేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేసేందుకు టీంలను నియమించి వారికి శిక్షణ ఇవ్వాలని ఆయన అన్నారు. సంబంధిత శాఖల కార్యాలయాలలో ప్రత్యేక కంట్రోల్ రూం ఏర్పాటు చేసి సిబ్బందిని ఏర్పాటు చేయాలని ఆయన ఆదేశించారు. గ్రామ వార్డు సచివాలయ పోస్టులు అన్నీ కూడా డిస్టిక్ సెలక్షన్ కమిటీ ద్వారా ఎంపిక చేయడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. కాల్ లెటర్స్ అభ్యర్థి ఈ మెయిల్ కు పంపించడం తోపాటు ఫోన్ కు మెసేజ్ చేయాలని సంబంధిత గ్రామ , వార్డు సెక్రటేరియట్ లకు పంపించి వాలంటరీల ద్వారా అభ్యర్థులకు కాల్లెటర్లు అంద చేయాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రామ సచివాలయం వెబ్ సైట్ ను రూపొందించాలని ఆయన సూచించారు.

# ప్రభుత్వ స్కూళ్లలో చదివిన విద్యార్థులకు కానుక

## వైద్య కోర్సుల్లో 7.5శాతం కోటా బిల్లుకు తమిళనాడు ఆమోదం

చెన్నై,అక్టోబర్30(ఆర్ఎన్ఎ): ప్రభుత్వ స్కూళ్లలో చదివిన విద్యార్థులకు వైద్య విద్యా కోర్సుల్లో 7.5 శాతం రిజర్వేషన్లు కల్పించే కోటా బిల్లుకు తమిళనాడు గవర్నర్ బన్వారిలాల్ పురోహిత్ శుక్రవారం ఆమోదం తెలిపారు. దీంతో జాతీయ స్థాయి ప్రవేశ పరీక్ష అయిన నీట్‌లో అర్హత సాధించిన స్టూడెంట్స్ లబ్ధిపొంద నున్నారు. 2020-21 విద్యా సంవత్సరం నుంచి వర్తించే ఈ రిజర్వేషన్ కోటా అమలు కోసం తమిళనాడు ప్రభుత్వం విధానపరమైన నిర్ణయం తీసుకోగా దానికి గవర్నర్ తన ఆమోదం తెలిపారు. దీనికి ముందుగా సొలిసిటర్ జనరల్ అభిప్రాయం కోసం సెప్టెంబర్ 26న గవర్నర్ లేఖ రాశారు. ఈ నెల 29న ఆయన నుంచి సమాధానం రావడంతో ఆ మేరకు 7.5 శాతం రిజర్వేషన్ కోటా బిల్లుకు బన్వారిలాల్ పురోహిత్ ఆమోదం తెలిపినట్లు రాజభవన్ అధికారులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

తమిళనాడు ప్రభుత్వ స్కూళ్లలో ఇంటర్ వరకు చదివి నీట్‌లో అర్హత సాధించిన విద్యార్థులకు వైద్య విద్యా కోర్సుల్లో 7.5 శాతం రిజర్వేషన్ కల్పించే కోటా బిల్లుకు ఆమోదం తెలుపడంలో జాప్యంపై ప్రతిపక్ష డీఎంకే అధ్యక్షుడు స్టాలిన్ ఇటీవల గవర్నర్ బన్వారిలాల్‌కు లేఖ రాయగా దీనిపై త్వరలో నిర్ణయం తీసుకుంటానని ఆయన సమాధానమిచ్చారు.

# కుటుంబ పాలనకు చరమగీతం పాడుదాం

## బిజెపికి ఓటేస్తేనే మార్పు సాధ్యం
## ఎన్నికల ప్రచారంలో మంత్రి కిషన్ రెడ్డి

సిద్దిపేట,అక్టోబర్30(ఆర్ఎన్ఎ): కెసిఆర్ పాలనలో తెలంగాణ అప్పుల పాలు అయిందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. దుబ్బాక ఉప ఎన్నిక ప్రచారంలో కిషన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఉప ఎన్నికలో దుబ్బాక ప్రజలు ఏమి తీర్పు ఇస్తారనే తెలంగాణ అంతా ఆసక్తి తో ఉన్నారని..అమర వీరుల తెచ్చిన తెలంగాణ, కెసిఆర్ కుటుంబం వంశం అయిందని మండిపడ్డారు. దళితున్ని ముఖ్యమంత్రి చేస్తా అన్నాడని..కానీ రెండు సార్లు కెసిఆరే ముఖ్యమంత్రి అయ్యాడన్నారు. బిజెపి లేకపోతే తెలంగాణ వచ్చేది కాదని..కాంగ్రెస్ ప్రభుత్వం మెడలు వంచి బిజెపి సపోర్ట్ తో తెలంగాణ తెచ్చుకున్నామని తెలిపారు. ఉద్యోగాలు ఇవ్వడం లేదు కానీ కెసిఆర్ మాత్రం తన కుటుంబానికి మాత్రమే పదవులు ఇస్తున్నారని ÷ర్ అయ్యారు. దుబ్బాక ప్రజలకు మంచి నిర్ణయం తీసుకునే అవకాశం వచ్చిందన్నారు. కెసిఆర్ కు షాక్ ట్రీట్ మెంట్ ఇచ్చే అవకాశం మీకు వచ్చింది ఆలోచించండి..బిజెపి పువ్వు గుర్తు కు ఓటు వేయాలని కోరారు. కెసిఆర్ సీఎం అయిన తర్వాత పావలా వడ్డీ మహిళలకు ఇవ్వడం లేదని..రైతులకు పావలా వడ్డీ ఇవ్వడం లేదని మండిపడ్డారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇస్తానని ఓట్లు వేసుకున్నా డని..కానీ ఇవ్వడం లేదన్నారు. కేజీ బియ్యం కు 30 రూపాయలు కేంద్రం లో మోడీ ఇస్తున్నారని..కెసిఆర్ ఇచ్చేది 2 రూపాయలే మాత్రమేన్నారు.తెలంగాణలో కెసిఆర్ కుటుంబ పాలన కొనసాగుతుందన్నారు. దుబ్బాక నియోజకవర్గంలోని భూంపల్లిలో ఎన్నికల ప్రచారం పాల్గొన్నకిషన్ రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలను కేసీఆర్ మర్చిపోయారన్నారు. కేసీఆర్ సీఎం అయిన తర్వాత పావలా వడ్డీ రుణాలు మహిళలకు ఇవ్వడం లేదన్నారు. రైతులకు పావలా వడ్డీ రుణాలు ఇవ్వడం లేదన్నారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వలేదన్నారు. కొత్త ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇవ్వలేదన్నారు. వర్షాలకు పంట నష్టపోతే కూడా పంటకు ఇన్సూరెన్స్ ఇస్తలేదన్నారు. ఇంటికో ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి..కుటుంబంలో అందరికీ ఉద్యోగం ఇప్పించుకున్నాడన్నారు. ఎన్నికల్లో ఓడించి కేసీఆర్ కు బుద్ధి చెప్పాలన్నారు. కేసీఆర్ పాలనలో తెలంగాణ అప్పుల పాలయిందన్నారు.

# రైతువేదిక పనులు పరిశీలించిన మంత్రులు

జనగామ,అక్టోబర్30(ఆర్ఎన్ఎ): అన్నదాతల సంక్షేమం కోసం ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా రైతు వేదికల నిర్మాణాలను చేపట్టిందని మంత్రులు అన్నారు. రైతు వేదికల నిర్మాణాల ప్రారంభోత్సవానికి రాష్ట్రంలోనే కొడకొండ్ల వేదికైన నేపథ్యంలో ముఖ్యమంత్రి కేసీఆర్ వనివారం31న జిల్లాలోని కొడకండ్ల మండలంలో ప్రారంభించనున్నారు. ఈ మేరకు రైతు వేదిక, ప్రకృతి వనం పనులు, సీఎం కేసీఆర్ రైతులను ఉద్దేశించి ప్రసంగించనున్న సభాస్థలి పనులను మంత్రులు నిరంజన్ రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్ రావు, సత్యవతి రాథోడ్, పూర్వ ఉప ముఖ్యమంత్రి, ఎమ్మెల్సీ కడియం శ్రీహరి పరిశీలించారు. ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



# ఉక్కు విగ్రహం

జవేర్ భాయ్ పటేల్, లాద్బాలకు జన్మించిన దివ్య తేజం
'సర్దార్ వల్లభాయ్ పటేల్' ఇది నిజం!
నడియాడ్ గ్రామంలో జన్మించి,
స్వతంత్ర సంగ్రామంలో తన సత్తా చూపించి,
అయ్యారు స్వతంత్ర భారత దేశానికి మొదటి ఉప ప్రధాని!
అయితే దురదృష్టవశాత్తు కోల్పోయారు తన సహధర్మచారిణిని,
నింగికి నిచ్చె నలా గోద్రా లో న్యాయవాదిలా
తన వాక్చాతుర్యంతో నిస్వార్థ సేవలు అందించి
అయ్యారు గృహ, సమాచారమంత్రిగా!
దృఢంగా, వేగంగా స్వతంత్ర పోరాటంలో
గాంధీ గారి మార్గదర్శక సూత్రాలకు ఆకర్షితుడై
అలుపెరగని సైనికుని వలె ఉద్యమించారు బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా !
నిజంగా అహ్మదాబాద్ మునిసిపల్ కమిషనర్ గా
ఎన్నికై 'సైరా' అంటూ 'కైరా' గ్రామంలో రైతులు
పడుతున్న కష్టాలు చూసి
భూస్వాములపై చేశాడు దండయాత్ర !
రాజ్యాంగ రచనలో పోషించాడు
ప్రముఖ పాత్ర!
మనసాక్షి గల 'ఉక్కుమనిషి'
ఉప్పుసత్యాగ్రహంతో అయ్యాడు జైలుపక్షి!
భారత దేశ ఐక్యతకు, సమైగ్రతకు ప్రాధాన్యత ఇచ్చిన వీరు దేవుని
అనుగ్రహంతో స్థిరపడి పోయారు నర్మదా నది ఒడ్డున జీవం గల ఎతైన
'ఉక్కు విగ్రహం' లా! !
31.10.2020 నాడు భారత దేశ మొదటి ఉప ప్రధాని ,
తొలి గృహ , సమాచార శాఖ మంత్రి కీ!!శే!!
శ్రీ సర్దార్ వల్లభాయ్ పటేల్ గారి పుట్టిన రోజు
మరియు జాతీయ ఐక్యత దినము గుర్తుగా వ్రాసినది



-బి. సునీల్ రాజు(బిసురా)
6281181869

# ఉద్యమాల వీరుడు-సర్దార్ పటేల్

నిండుకుండలాంటి వ్యక్తిత్వం
నిరాడంబరమైన జీవితం
కార్యదక్షత ఆయన సొంతం
పోరాటమే ఊపిరిగా
పోరాడెను భయమెరుగక
ఉద్యమాల వీరుడు
విచ్ఛిన్నమైన సంస్థానాలను
ఒక్కతాటికి తీసుకొచ్చెను
ఇండియన్ లో కలిపెను
సమైక్యతను చాటెను
సమైక్య భారత్ లో
ఉక్కుమనిషిగ కీర్తిపొందెను
స్వతంత్ర దేశ పాలనలో
ఉపప్రధానిగా, హోంమంత్రిగా
ప్రథమ స్థానం పొందెను
సేవలెన్నొ చేసెను

-మాసని వెంకటయ్య
9000097365

# ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన జడ్పీ చైర్‌పర్సన్



రాజన్న సిరిసిల్లా, అక్టోబర్ 30 (నేటినిజం ప్రతినిధి): రైతు సంక్షేమానికి టీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేస్తుందని జడ్పీ చైర్ పర్సన్ న్యాలకొండ అరుణ అన్నారు. జిల్లాలోని వేములవాడ పట్టణం బాల్‌నగర్‌లో వేములవాడ ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో ధాన్యం కోనుగోలు కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా అరుణ మాట్లాడుతూ..రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించి ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. దళారుల మాటలు నమ్మి రైతులు మోసపోవద్దన్నారు. కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని రైతులను కోరారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# పూటకో పుకారు.. గంటకో అబద్ధం

## అసత్యమే బీజేపీ ఎన్నికల ఆయుధం
## సత్యమేవ జయతే అనే సూక్తి విస్మరణ
## బిజెపి చేస్తున్న ఆరోపణలపై మంత్రి హరీష్ రావు వివరణ

సిద్ది పేట,అక్టోబర్30(ఆర్ఎన్ఎ): అబద్దాల ప్రచారంలో బిజెపి ఎప్పుడూ ముందుంటుందని రాష్ట్ర ఆర్థిక మంత్రి హరీష్ రావు అన్నారు. అయితే దుబ్బాక ఉప ఎన్నికల్లో మాత్రం ఈ మోతాదు మించి ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ తదితరులతో కలిసి మంత్ఇర మీడియాతో మాట్లాడుతూ ఝూటా మాటల బీజేపీ అంటూ విమర్శలు గుప్పించారు. మొత్తం 11 అబద్దాలను వీడియా సాక్షిగా హరీష్ రావు బయటపెట్టారు. రాష్ట్ర బీజేపీ నాయకులు తమ వైఖరితో బీజేపీని భారతీయ ఝూటా పార్టీగా మార్చేశారని పేర్కొన్నారు. పూటకో పుకారు పుట్టించి.. గంటకో అబద్ధం మాట్లాడటం బీజేపీ నాయకుల నైజం అని మండిపడ్డారు. వెయ్యి అబద్దాలు ఆడైనా ఒక పెళ్లి చేయాలనే సామెత అందరికి గుర్తే.. అలా దుబ్బాకలో వెయ్యి అబద్దాలు ఆడైనా ఒక ఎన్నిక గెలవాలె అనే కొత్త సామెతను సృష్టిస్తున్నదని విమర్శించారు. దుబ్బాక ఉప ఎన్నిక ప్రచారం ప్రారంభం నుంచి ఒక్క బీజేపీ నాయకుడు కూడా నిజం మాట్లాడటం లేదు.. అబద్దాలే పునాదిగా బీజేపీ నాయకులు తప్పుడు ప్రచారాలకు తెరతీసిందన్నారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మొదలుకొని గ్రామస్థాయి వార్డు నేత దాకా అందరూ అబద్దాలు ఆడేవారే అని ధ్వజమెత్తారు. అసత్యమే బీజేపీ ఆయుధం అని విమర్శలు చేశారు. వ్యక్తిగత దూషణలు వారి నైజం అని విరుచుకుపడ్డారు. భారతీయ సాంప్రదాయానికి తామే ప్రతినిధులమని చెప్పుకునే బీజేపీ నాయకులు.. సత్యమేవ జయతే అనే ఉపనిషత్ సూక్తిని విస్మరించి, అసత్యమేవ జయతే అని వారు నమ్ముతున్నారని విమర్శలు గుప్పించారు. శ్రీకృష్ణుడు శిశుపాలుని తప్పులు లెక్కపెట్టినట్టు తాను బీజేపీ నేతల అబద్దాలను లెక్క పెడుతున్నాను. అందులో కొన్నింటిని మీ ముందుకు తీసుకొచ్చానని మంత్రి హరీష్ రావు పేర్కొన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వం బీడీ కార్మిక మహిళలకు ఇస్తున్న పెన్షన్ 2016 రూపాయలలో, 1600 రూపాయలు మోడీ ఇస్తున్నారని బిజెపి నేతలు అన్నారు. పట్టపగలు పచ్చి అబద్దాన్ని ప్రచారం చేస్తుంటే.. నిజాలు నిగ్గు తేల్చాలని తాను సవాలు విసిరాను. అంతే తోక ముడిచారు. కాంగ్రెస్ పెట్టిన పుర్రె గుర్తుతో బీడీల అమ్మకాలు తగ్గినాయి. బీడీల అమ్మకాలపై బీజేపీ ప్రభుత్వం 18 శాతం జీఎస్టీ విధించడం వల్ల బీడీల అమ్మకాలు మరింత పడిపోయాయి. ఈరోజు బీడీ కార్మికులకు 15 రోజుల పని కూడా దొరకడం లేదు. ఉన్న పనిని పోగొట్టిన బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు బీడీ కార్మికుల జీవితాల్లో మన్ను పోశాయి. టీఆర్ఎస్ ప్రభుత్వం రూ. 2016 పెన్షన్ ఇచ్చి బీడీ కార్మికులను కడుపుల పెట్టి చూసుకుంటున్నది.కేసీఆర్ కిట్ పథకం కింద ఇచ్చే డబ్బు 13 వేలలో.. 6 వేల రూపాయలు కేంద్రం ఇస్తుందని ఒకరు, 8 వేలు ఇస్తుంది అని ఇంకొకరు అబద్దాలు చెప్తున్నారు. అబద్ధం కూడా తలోరకంగా చెప్తున్నారు. నిజానికి ఇందులో కేంద్ర ప్రభుత్వానిది నయా పైసా లేదు. కేసీఆర్ కిట్‌ను 100 శాతం టీఆర్ఎస్ ప్రభుత్వమే ఇస్తున్నది. గొర్రెల యూనిట్లలో రూ. 50 వేలు బీజేపీ ఇస్తుంటే కేవలం రూ. 25 వేలే టీఆర్ఎస్ ఇస్తున్నదట. ప్రజలను గొర్రెలుగా భావించే వారే ఇటువంటి అబద్దాలు చెప్పగలరని మంత్రి అన్నారు. ఈ పథకం ఖర్చు నూటికి నూరుశాతం రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తున్నది. బీజేపీ నాయకులకు యూనిట్ కాస్ట్ కూడా తెలియదు. అంటే అబద్ధమే కాక అజ్ఞానంతో కూడిన అబద్ధం ఆడుతున్నారు. యూనిట్ కాస్ట్ మొత్తం ఒక లక్షా ఇరవై ఐదు వేలు. ఇందులో లబ్దిదారుని వాటా 25 శాతం అంటే రూ. 31,250, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ 75 శాతం అంటే రూ. 93,750 రూపాయలు. ఇది కూడా తెలియకుండా నోటి కొచ్చిన అబద్ధం చెప్పేస్తున్నారు. ఇప్పటి వరకు 77 లక్షల గొర్రెలను 3,70,000 మంది గొల్ల కుర్మ సోదరులకు ప్రభుత్వం పంపిణీ చేసింది.

కేంద్రం రూ. 25 కోట్లతో ఈఎస్ఐ హాస్పిటల్ చేగుంటకు మంజూరు చేస్తే టీఆర్ఎస్ దాన్ని గజ్వేల్‌లో పెట్టుకున్నదని అంటున్నారు. గజ్వేల్‌లో ఈఎస్ఐ ఆస్పత్రి లేదు. చేగుంటకు ఈఎస్ఐ ఆస్పత్రి మంజూరు కాలేదు.. ఒక వేళ మంజూరు అయితే ఆధారం చూపించండి.. ఇంత గాలి మాటలా? అని ప్రశ్నించారు.

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas, Ph.No.040- 2766 2477.
**RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com